# మాస్టర్ C.V.V. యోగము

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంథకర్తవి, ప్రచురణకర్తవి.

# ప్రస్తావన

మాస్టర్ C.V.V. ఒక మహా యోగి. బ్రహ్మమే మరల దిగివచ్చి కుంభ చైతన్యమును యోగమునకు జోడించి అందించినదని ప్రాజ్ఞుల అవగాహన. భృక్తము రహితము గావించి రాజయోగ మార్గమున జీవన్ముక్తులను వేగముగ తయారుచేయు యోగమును మాస్టర్ C.V.V. గారందించినారు. ఈ యోగమును మాస్టర్ E.K. గారు సమన్వయించి బహుళ జనాదరణము కలుగునట్లు మలచి వేలాది జనులకు అందించినారు. వీరిరువురి అనుయాయి అయిన డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారు ఈ యోగమును లోతుగ పరిశీలించి, అనుసరించి, అనుభవము గడించి, ప్రపంచ వ్యాప్తి గావించినారు. పరమగురువు మాస్టర్ C.V.V. గురించిగాని, వారి యోగమును గురించిగాని శ్రీ కుమార్‌గారు ప్రసంగించు చున్నపుడు సభికులు అత్యంత ఉత్తేజమును పొందుట పరిపాటి. వీరి 'మే కాల్' సందేశములు ప్రపంచము నలుదిశల ఆదరింపబడి మాస్టరు గారి యోగమునకు జీవులను నియమించు చున్నవి.

వారికి కేటాయించిన గం॥ 1-30 నిముషముల ప్రవచన సమయమున, ఆగష్టు 4, 2000, మాస్టర్ C.V.V. గారి జన్మదిన సందర్భమున శ్రీ పార్వతీకుమార్ గారందించిన యోగ విశేషములు చాలా మందికి స్ఫూర్తి కలిగించుట వలన, వాటిని ప్రచురించమని పలుమార్లు మాకు సూచన లందుట వలన, శ్రీ పార్వతీకుమార్‌గారి నాటి ఉపన్యాసమును యథాతథముగ ప్రచురించి అందించు చున్నాము.

అటులనే మాస్టర్ C.V.V. గారి "*MYSTIC MANTRAMS*"ను శ్రీ కుమార్‌గారు స్వేచ్ఛానువాదము చేసి 'నావాణి' మాస పత్రికలో 'మర్మమంత్రములు' శీర్షిక ద్వారా పాఠకులకు అందించినారు. ఇవి యోగసాధకులకు ఎంతయో ఉపయుక్తము. అటులనే మాస్టర్ C.V.V. గారి సరళము, గంభీరము అయిన కొన్ని మాటలను కూడా 'మాస్టరు మాట' ద్వారా అందించుచున్నాము.

యోగాసక్తులకు ఇది ఉపయోగపడును గాక !

4-8-2002 **- ధనిష్ఠ**

# మాస్టర్ C.V.V. యోగము

## సాధన, నిరంతరత :

సత్సాధకుడు ప్రతిరోజూ ఉదయం తాను మేల్కాంచగనే "తనయందు మాస్టరు చైతన్యము పుట్టినట్లుగా భావన చేసి, ఆ చైతన్యము తన యందు వృద్ధి పొందుతున్నట్లుగా భావన చేసి, ఆ చైతన్యంలో భాగంగా జీవితాన్ని నడుపుతున్నట్లుగాను, ఆ జీవితాన్ని కూడా మాస్టరుగారే నడిపిస్తున్నట్లుగాను" భావన చేయాలి. కానీ మనకి మరపు చాలా సహజం కదా! ఓ సారి 'మే కాల్ డే' (May call day) నాడు గట్టిగా తలచుకొని, మళ్ళీ ఆయన పుట్టినరోజు అయిన ఆగష్టు 4వ తేదీన ఓసారి గట్టిగా తలచుకొంటే చాలదు, ఇలా చేస్తే అంటు కట్టినట్లు అవదు. అంటు కట్టలేకపోతే దేనికైతే అంటుకట్టామో, దాని నుండి వచ్చే చైతన్యము గాని, ప్రాణాన్నిగాని, తెలివిని గాని అందుకోవడానికి అవకాశం వుండదు. సాధన "అనుస్యూతం" జరగాలి, "నిరంతరం" సాగాలి. సాధన లేనిదే సిద్ధిలేదు. అటువంటి సిద్ధి మనకు కలగాలి అనే సదుద్దేశంతోనే ఒక సద్గురువును ఆశ్రయించడం జరుగుతుంది. జీవపరిణామ దశల్లో ప్రతి జీవునికీ కూడా ఏదో ఒక రోజున ఒక సద్గురువుతో పరిచయం కలుగుతుంది. దానిని

పెంచుకోవలసిన బాధ్యత సాధకులది. పెంచడానికి ఆయన సిద్ధం గానే వుంటారు కనుక మాస్టరు C.V.V. పుట్టినరోజు ఉత్సవములో మనకు ముందు జరుగవలసినది ఆత్మస్మరణ (గురుస్మరణ). అలా మనం ప్రతిరోజూ పుట్టినరోజుగా చేసుకోవచ్చు. ఉదయం మేల్కొంచి నపుడు మనం చైతన్యవంతులం అవుతాం. అంతకు ముందు మనం సత్యవంతులం. సత్యవంతుడు, చైతన్యవంతుడైనప్పుడు తానెక్కడి నుండి పుట్టాడో దానితో తాను అనుసంధానం చెంది, దానికి సమర్పణ చెంది తద్వారా జీవించడం చేసినట్లయితే అది ఆత్మవంచన లేని సాధనగా జరుగుతుంది. కాని మనం ఏదో వేడుకగా ఒక్కొక్కసారి, మధ్యమధ్యలో "పోన్లే పాపం" అన్నట్లుగ, ఆత్మను (గురువును) తలుచుకుంటే, ఆయన కూడా "పోన్లే పాపం" అన్నట్లుగా వదిలేస్తారు.

సత్యసాధన మనయందు జరగాలంటే శ్రద్ధ, భక్తి, నిరంతర సాధన జరగాలి. లేకపోతే ఎన్నాళ్ళు అయినా మనలో భయంకరంగా శరీరం పెరగడం మినహా ఇంకేమీ పెరుగుదల వుండదు. పెరిగిన శరీరం జబ్బులు తెచ్చిపెడుతూ, మృత్యువాత పడడానికి, అవకాశం కల్పిస్తూ వుంటుంది. పెరగవలసినది శరీరమా? చైతన్యమా? జీవ చైతన్యం పెరగాలంటే కొద్దివిషయాలైనా శ్రద్ధగాను, భక్తిగాను ఆచరించి నట్లయితే మనకి వృద్ధినిస్తాయి. అలాకాక ఊరికే ఒకటికి పది, వంద, వేయి పెట్టుకొని ఏదీ సరిగ్గా చేయలేకపోతే దేనివలనా మనకి ఆనందం కలగదు. చైతన్యవంతులము కాలేము. మన మనస్సులోని పీడ మనల్ని మరణం వైపుకి నడిపిస్తూ వుంటుంది. దాని నుండి రక్షించాలనే సద్గురువులను ఆశ్రయించడం. వారిని "మనం ఆశ్రయించాం" అని

చెప్పుకుంటున్నాం కాబట్టి, "వారు చెప్పినది" మనం తప్పకుండా చేయాలి.

## పరతత్త్వం, గురుతత్త్వం :

మాస్టరు C.V.V. అనే మహా చైతన్యం ఈ భూమికి దిగి రావడం ఒక అద్భుతమైన అంశం, అది ఎక్కడెక్కడో ఊర్ధ్వ లోకాల నుండి దిగివచ్చి, మన గోళం చేరుకొని, మనల్ని చేరుకుంది. కేవలం మనమీద ఉండే అపారమైన ప్రేమ, కరుణ, ఆదరము, వాత్సల్యము కారణాలుగా మనల్ని ఉద్ధరిద్దామని మనల్ని చేరింది. మనని పరిచయం చేసుకుంది. అయినా కూడ దానియందు మనకుండే ఆసక్తి అంతంత మాత్రమే. అసలు ప్రతిరోజూ ఎక్కడినుండో సూర్య రశ్మి వచ్చి మనల్ని చేరుతున్నదే, అది మనల్ని చేరే సమయానికి మనం ఎంత సిద్ధంగా వుంటున్నాము? అంతకన్నా దూరమైనటువంటి లోకాలనుండి దిగివచ్చిన "కుంభచైతన్యపు ప్రజ్ఞ" మనమెరిగినటు వంటి, మనం అనుకుంటున్నటువంటి మాస్టరు C.V.V. ప్రజ్ఞ. ఆ ప్రజ్ఞని "తెర వెనుక ప్రజ్ఞ" అంటారు. ఆంగ్లంలో The background conciouness అంటారు. అందుకే మనకి మాటి మాటికి గుర్తురాదు. మనకి తెరముందు కథే అంతంత మాత్రం. ఇక్కడ కథకన్నా వెనుక తెరవుంది. ఆ తెరవెనుక "అది" వున్నది. కనుక ఎక్కువ గుర్తుకు రావడానికి అవకాశం వుండదు. దీనినే పరతత్త్వం, పరబ్రహ్మము అని కూడా అంటారు.

తెర వెనుక విషయం గుర్తుకు వస్తే, తెర చిన్నదయిపోతుంది. ఈ తెర ఎన్నో నాటకాలు ఆడిస్తోంది. అసలు ఈ తెర వెలగకపోతే

దానిమీద బొమ్మలేం పడతాయి? తెరని వెలిగించేవాడు తెర వెనుక వుంటాడు. తెరమీద నాటకం నడిపించేవాడూ, తెర వెనుకే వుంటాడు. కనుక తెర వెనుక వున్న ప్రజ్ఞ మనకి తెలిస్తే, మన మాస్టరు C.V.V. అంటే ఏమిటో తెలుస్తుంది. అందుకే మన మాస్టరు E.K., C.V.V. గార్ని The background conciousness అన్నారు.

**అవతరణము :**

చైతన్యం వుండగ, విశ్వాత్మక చైతన్యం వుండగ, ఆ చైతన్యాన్ని నడిపించే చైతన్యంగా మాస్టరు C.V.V. ప్రజ్ఞ వున్నది అని చెప్పారు. అంటే అది పరతత్త్వము లేక పరబ్రహ్మతత్త్వము. కనుక ఆ తత్త్వము సరాసరి మరోసారి మనల్ని అనుగ్రహించడానికి అంతరిక్షములో వుండే రకరకములైన మండలములు దాటి వచ్చి, సరాసరి సింహరాశిలో ప్రవేశించి, సింహరాశి నుండి సరాసరి శ్రావణమాసంలో ప్రవేశించి, అక్కడ నుండి, శ్రావణ పౌర్ణమి ఘడియలలో భూమికి దిగివచ్చి, బహుళ పాడ్యమినాడు ఒక శరీరాన్ని బాహ్యంగా బయటకి వ్యక్త పరచింది.

మాస్టరు C.V.V. గారు 4, ఆగష్టు 1868లో జన్మించినట్లుగా అందరికీ తెలుసు. ఆ రోజు తిథి శ్రావణ పూర్ణిమ ఘడియలు పూర్తయి, పాడ్యమి ఘడియలు మొదలైన శుభసందర్భములో, చంద్రుడు కుంభ రాశిలో వుండగా జన్మించిన ఒక మహత్తరమైన ప్రజ్ఞ అది. దాన్ని "*కుంభ చైతన్యం*" అంటారు. అందుకే అది కుంభకోణంలో జన్మించి నది. అంతకుముందు 25 వేల సంవత్సరముల క్రితం కుంభయుగం వచ్చినప్పుడు కుంభచైతన్యం ఆ విధంగానే కుంభకోణంలో ప్రవేశిం

చింది. మరల అక్కడే ప్రవేశించాలని నిర్ణయం చేసుకొని ఆ విధంగానే దిగివచ్చింది.

"ఎందుకు దిగివచ్చింది?" అని అడిగితే, "మనకోసమే". "మనలో ఏమి మార్పులు చేయడానికి దిగివచ్చింది?" అంటే "మనలో వుండే సూక్ష్మ శరీరాన్ని చక్కగా నిర్మాణం చేసి, అది నశించకుండ వుండేటట్లుగ దాన్ని స్థిరపరచి, అది కారణంగా మనకి మరణం లేనటు వంటి స్థితిని ప్రసాదించడం కోసం దిగివచ్చింది. సూక్ష్మశరీర నిర్మాణ మును పటిష్ఠము చేసి, అమరత్వము సాధించి పెట్టడం అనే విషయాన్ని మానవ జాతికి అందించడానికి యోగములో నూతన పరిణామము తీసుకొని వచ్చింది.

సృష్టి మొత్తం, పరిణామం చెందుతునే వుంటుంది. సృష్టి కథ జీవుల పరిణామ కథే. అలాగే సృష్టిలోని శాస్త్రములు కూడా పరిణామం చెందుతూ వుంటాయి. దాన్నే ఆంగ్లంలో ఇవల్యూషన్ (Evolution) అంటారు. అన్ని శాస్త్రాలతో పాటుగా జ్యోతిషం, యోగ విద్య కూడ పరిణామం చెందినాయి. ఈ రెంటికి ఈ రకమైన పరిణామాలు కల్పించినవారు మాస్టరు C.V.V. అది ఆయన కీయ బడిన కర్తవ్యం. దానిని ఆయన సక్రమంగ, నిశ్శబ్దంగ, గుప్తంగ, గుట్టుగా నిర్వర్తించి వెళ్ళిపోయారు. వెళ్ళిపోయారు అంటే, మనలోకి, మన పరిసరాలలోకి అదృశ్యులైనారు. అంతకు ముందు దృశ్యంగా వుండే మాస్టరు ప్రజ్ఞ, ఇప్పుడు భూగోళం అంతా అదృశ్యంగ, తన యొక్క సూక్ష్మ శరీరంతో ఆవరించి వున్నది.

## మరణం :

ప్రజ్ఞగా తను ఆవరించి వుండి, పిలిచినవారిలో ప్రవేశించి, వారి సూక్ష్మ శరీరాన్ని నిర్మాణం చేసి, పునరుత్థానం చేసి "మరణం లేని స్థితి కల్పిస్తా" నని వాగ్దానం చేసారు. "అందరికీ చావులేని స్థితిని కలిగించడానికి, అందరికీ బ్రహ్మత్వం అనుభూతి చెందింప జేయడానికి నేను దిగివచ్చాను. అది అయ్యేంతవరకు ఈ భూమి ఆవరణలో వుంటాను" అని మాస్టరు గారు చేసిన చక్కని వాగ్దానం మనకి వున్నది. వారికిగా వారే 18 సార్లు మరణించి జీవించినట్లుగా తన అనుయాయులకు ప్రదర్శించి చూపించారు. షిరిడీ సాయి కూడా అలాగే మృత్యువు లేదని ప్రదర్శించారు. నిజానికి మృత్యువు లేదని తెలుపుటయే ప్రప్రథమంగా నేర్పవలసిన విషయం. భగవద్గీత, భాగవతం కూడా ఈ విషయమే ప్రతిపాదిస్తున్నవి.

మరణం లేదని తెలియాలి అంటే, ఒక నిర్దిష్ట పథకం లేక విధానం ప్రకారం సూక్ష్మ శరీరం పటిష్ఠంగా నిర్మాణం కావాలి.

## ప్రార్థన :

నీకు నేను త్వరితగతిని సూక్ష్మ శరీర నిర్మాణం చేసిపెడతాను. ఈ సూక్ష్మ శరీరం నిర్మాణం జరగడానికి నేనిచ్చిన, బీజాక్షరాల్ని శ్రద్ధతో, భక్తితో ఉచ్చరించి, విని, కన్నులు మూసుకొని లోపల జరిగే ప్రక్రియను గమనిస్తూ వుండు అన్నారు. అది మంత్ర జపంలాగ చేయవద్దు అన్నారు. ఎందుకంటే అది జపానికి సంబంధించిన మంత్రం కాదు కనుక. అలాగే రూపాన్ని కూడ ఎక్కువ ధ్యానం చేయవద్దని అన్నారు.

ఒకసారి రూపాన్ని చూచి, వారి కన్నులను చూచి, లఘువుగా కనులు మూసుకొని, ఆ తర్వాత వారిచ్చిన బీజాక్షరములను ఉచ్చరించడం చేత మనలో ఒక విధమైన విద్యుత్ ప్రసారం మొదలౌతుంది. అది మొదలైనప్పుడు లోపల మార్పులు జరుగుతాయి. అవి ఏమిటో మనకు తెలియదు. తెలిసినా చూస్తుండడమే తప్ప చేసేదేం లేదు. సాక్షిగా చూడడమే. "నీ లోతట్టున ఏమేమి జరుగునో గమనించుచూ వుండు" అనడంలో "నీకేం తెలియదు, నువ్వేం చెయ్యవద్దు. నేను చేసుకుంటాను, నాకు వదిలెయ్యి." అని వారి ఉద్దేశ్యం. కారు షెడ్‌లో కారు రిపేరుకి ఇచ్చినపుడు, రిపేరు చేసేవాడు రిపేరు చేస్తుంటే మనం కార్లో కూర్చుంటే అంత బావుండదు కదా! కావాలంటే బయట కూర్చొని, ఏం రిపేరు చేస్తున్నాడో చూస్తాం. అలాగే ఆలోచనలు ఏమైనావస్తే..... పోనియ్యి, ఫర్వాలేదు. గమనిస్తూ వుంటే అవే తగ్గిపోతాయి. కారు మెకానిక్ కూడా "అలా ఒకసారి పోయి రండిసార్, నేను పనిచేసి పెడతాను." అని అంటాడు కదా! అందుకని 15 ని॥లు..... 20 ని॥లు.... 30 ని॥లు.... 40 ని॥ల పాటు నీకు ఎంతసేపు లోపల ప్రసారం జరుగుతూ వుంటే అంతసేపు గమనిస్తూ వున్నట్లయితే, దాన్ని మన మాస్టరు గారికి సమర్పణ చేసి వదిలేసి నట్లయితే "కన్నులు తెరుద్దాం" అనే భావన వచ్చేవరకు, ఆ విధంగా ఆ ప్రసారం జరుగు తుంది. కాబట్టి నిర్వర్తింప చేసుకోవాలి.

ఉదయం, సాయంత్రం 6 గం॥ల సమయానికి శరీరం, మనసు శుచిగా వుంచుకొని, మాస్టరుగారి చిత్రపటాన్ని ఉత్తర ముఖముగానో, తూర్పు ముఖముగానో వుంచి, అగరువత్తులు, దీపం వెలిగించి, సుఖము, స్థిరము అయిన ఆసనం ఏర్పరుచుకొని కూర్చోవాలి.

హృదయంలోనో, భ్రూమధ్యంలోనో మాస్టరుగారిని మానసికంగా దర్శించి, నమస్కారం చేస్తూ "మాస్టర్ *C.V.V. నమస్కారం*" అని ఉచ్చరించాలి. అలా ఉచ్చరించినపుడు మాస్టరుగారు (పద్మాసనాసీనులై యున్నవారు) తన దక్షిణ హస్తంతో మనలను ఆశీర్వదిస్తున్నట్లు, యోగమారంభించ మంటున్నట్లు, తాను పని ప్రారంభిస్తున్నట్లు, మనము సాక్షీభూతముగా మన దేహ కోశములందు జరుగు మార్పులను చూస్తున్నట్లు భావించాలి. మార్పులు జరుగుతున్నంత సేపు కనులు తెరుచుకోవు. ఆ రోజుకు *వర్కింగ్స్* (Workings) పూర్తి అయిన తరువాత కనులు తెరుచుకుంటాయి. ఏ రోజున ఎంతవరకు జరిగితే శ్రేయస్సో, అంతవరకే మాస్టరుగారు మార్పులు (వర్కింగ్స్) జరుపుతారు.

ప్రార్థనలో ముఖ్యాంశమేమిటంటే, మనము చేయవలసిన అభ్యర్థన. అది ఏమిటంటే :

"మాస్టరు గారు! పద్మకోశం వంటి ఈ నా శరీరంలోని సమస్త కోశములను పరిశుద్ధి గావించండి. భావములను, కోరికలను ధర్మయుక్తం చేయండి. ప్రాణమును పెంపొందించండి. కామమును తగ్గించండి. సూక్ష్మ శరీరమును తీర్చిదిద్దండి. అమరత్వం ప్రసాదించండి. మీ దివ్య ప్రణాళికలో నాకు కర్తవ్యాన్ని, బాధ్యతను ఏర్పరచండి. పరహితమునకు నన్నంకితం చేయండి. నేను మీకు సదా వాహికనై వుండునట్లు అనుగ్రహించండి."

పై అభ్యర్థన గావించి కనులు మూసుకొని కూర్చోవాలి. క్రమశః సాధకుని శ్రద్ధాభక్తుల బట్టి సాధన సిద్ధిస్తుంది. మాస్టర్ E.K. గారికి 12 సం॥లలో సిద్ధించినది. మాస్టర్ M.N. గారికి కూడా అలాగే

సిద్ధించినది. వారిరువురు యిపుడు దివ్య ప్రణాళికలో సింహభాగం వహించి యున్నారు. ఈ విధంగా మాస్టరుగారి ప్రార్థనతో దివ్య వాహికలు తయారు కాగలవు. అది మాస్టరు C.V.V గారి వాగ్దానం.

## సూక్ష్మ శరీర నిర్మాణం :

మనలో వుండే సూక్ష్మశరీర నిర్మాణానికి రెండు రకములైన ఆటుపోట్లు వుంటాయి. ఒకటి, సూక్షశరీరం నుండే భౌతిక శరీరానికి ప్రాణము అందుతూ వుంటుంది. ప్రాణం మనలో ఉచ్ఛ్వాస నిశ్వాసలు గాను, ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన అనే ప్రాణ ప్రవృత్తులు గాను, గుండె, ఊపిరితిత్తులు, శ్వాస అవయవములు కదలడముగాను గోచరిస్తుంది. సూర్యరశ్మినుండి ప్రాణం సూక్ష్మ శరరంలో వుండే చక్రముల ద్వారా భౌతిక శరీరంలో ఉండే గ్రంథుల నుండి భౌతిక శరీరానికి అందింపబడుతుంది. అసలు ప్రాణం ఎట్లా మన లోపలికి వస్తుందో తెలియాలి కదా !

మన పరిసరాలలో ప్రాణశక్తి వున్నది. ఆ ప్రాణశక్తిని మన ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారా లోపలికి అందుకుంటాం. సూక్ష్మ శరీరం ఏం చేస్తుందంటే, పరిసరములలోని మహా ప్రాణాన్ని, తనలోని రెండు కేంద్రముల ద్వారా (వెన్నెముక యందు రెండు భుజముల నడుమ గల గూడువద్ద, అనాహతముపైన విశుద్ధి క్రింద గల కేంద్రము ద్వారాను, ప్లీహమునకు సంబంధించిన సూక్ష్మ కేంద్రము ద్వారాను) ప్రాణాన్ని తాను అందుకుంటుంది. తానందుకొని, తనలో వుండే ప్రజ్ఞా కేంద్ర ముల ద్వారా భౌతికంగా వుండే గ్రంథులకి అందిస్తుంది. ఈ గ్రంథుల నుండి శరీరములోని సమస్త భాగములకు అందింప బడుతూ

వుంటుంది. ఆ విధంగా సూక్ష్మ శరీరం ప్రాణాన్ని స్థూల శరీరానికి అందిస్తూ వుంటుంది. అలాగే తెలివిని కూడ సూక్ష్మ శరీరం స్థూల శరీరానికి షట్చక్రముల ద్వారా అందిస్తూ వుంటుంది.

రెండు, సూక్ష్మశరీరం సరాసరి వెలుగును అందుకొని, ఆ వెలుగుని మనలో ప్రతిబింబింప జేస్తుంది. ఈ శరీరం ఆధారంగానే మనకు భౌతికశరీరం ఏర్పడి వుంది. ఈ శరీరం కనుక ఎప్పటికీ మన యందు పటిష్ఠంగా వున్నట్లయితే, భౌతిక శరీరం రాలిపోయినా కూడ సూక్ష్మ శరీరంలో వుండడానికి అవకాశం ఏర్పడుతుంది. అటువంటి శరీర ధారులనే "దివ్య శరీరధారులు" అంటారు. దివ్య శరీరధారుల్నే "విదేహులు" అని కూడ అంటారు. "విదేహు" అంటే విశిష్టమైన దేహము కలవారు అని అర్థం. విదేహులంతా యోగులు. అటువంటి యోగులకు నాయకుడు జనక మహారాజు. అందుకే శ్రీ కృష్ణమూర్తి భగవద్గీతలో "జనకాదయః", జనకుడు ఆదిగా కలిగినటువంటివారు ఈ విధంగానే నిర్వర్తించుకున్నారు అనే ఉదాహరణకు జనకుణ్ణి ఎన్నుకున్నాడు. కనుక విశిష్ట దేహములను మనం ధరించడం ద్వారా మరణమును దాటి, ఆ తర్వాత బ్రహ్మత్వమును పొందుటకు ప్రయత్నించవచ్చు. కనుక ఆ పద్ధతులలో జీవించడానికి కావలసిన సాధనంతా ఈ సూక్ష్మ శరీరము యొక్క పటిష్ఠతను బట్టి వుంటుంది.

ఈ సూక్ష్మ శరీరానికి రెండు రకాల ఆటు పోట్లుంటాయి. ఒకటి, మనలో వుండే కోరికలు అసంబద్ధంగాను, ధర్మానికి వ్యతిరేకంగాను, ధర్మాన్ని అతిక్రమించి వుంటే, కామ శరీరం అనే తుప్పు, ఈ సూక్ష్మ శరీరం చుట్టూ చేరుతుంది. అందుకే మహాత్ము లంతా "కోరికలను సరిచూసుకో" అని చెప్తారు. మన మాస్టరు గారు "నీ కోరికలను

నాకు వదిలేసెయ్యి, నీకు ఏంకావాలో అది నన్ను కోరు. నేను, నీ సమస్త సౌకర్యాలను చూసేవాడినని నమ్మకం వుంటే ఇంక ఎవరినీ ఏమీ కోరక'' అని చెప్పారు. కోరడం మొదలు పెడితే సూక్ష్మ శరీరానికి దెబ్బ తగులుతుంది. ప్రతీ కోరిక, ఇనుపముక్కకి తుప్పు పట్టినట్లుగా వుంటుంది. ఇలా వుంటే అయస్కాంతీకరణకు అవకాశం వుండదు. ప్రసారం జరగదు. కామ శరీరం పెరిగేకొలదీ, యోగమయమైన సూక్ష్మ శరీరాన్ని బాగా సన్నగిల్ల చేస్తూ వుంటుంది. శరీరమంతా కాంతి తగ్గి మొహం మాడిపోతుంటుంది. ప్రాణం కూడ సూక్ష్మ శరీరంనుండి ఈ భౌతిక శరీరానికి సరిగా అందదు. జబ్బులు వస్తాయి. ఒక ప్రక్క ప్రాణశక్తిని సన్నగిల్లచేసి, భౌతిక శరీరాన్ని క్షీణింపచేసి సూక్ష్మశరీరం బలంగా తయారయ్యే లోపల, భౌతిక శరీరం చచ్చిపోయేట్లుగా ఒక కార్యక్రమం జరుగుతుంది.

ఇదంతా దేనివలన? కామం వలన. మరి కామం వుండ కూడదా? ఉండవచ్చు. అది ధర్మసమ్మతంగ, ప్రకృతి సిద్ధంగ, సహజంగా వుండాలి. అసహజంగాను, అతిగాను, మితిమీరిన కోరికలు కోరడంగాను వుండరాదు. ఈ రోజుల్లో భక్తులు చాలా వరకు వారి వారి వ్యక్తిగత కోరికలు తీరడం కోసం దైవాన్ని గాని, గురువునుగాని ఆశ్రయించడం జరుగుతోంది. ఇది సత్యం. మనలో వుండే కోరికల మేరకు మన భక్తి కనిపిస్తూ వుంటుంది. ఎక్కడ పనులౌతుంటే అక్కడికి వెళ్తుంటారు. సద్గురువుని వాడుకొనే కాలం కాబట్టి, ఇది కలికాలం. నిజంగా మనకి భక్తి పెరిగితే, దానితో బాటు వైరాగ్యం పెరగాలి. కోరికలు తగ్గి, ధర్మసమ్మతమైన కోరికలు వుండి, క్రమంగా అవి కూడా తగ్గుతూ వుండి, బహుకొద్ది కోరికలు మాత్రమే వుండి, కోరికలు లేని

స్థితి రావాలి. అదీ సరియైన సాధన. కానీ మనకి ఆ పద్ధతిగా సాగదు. చదువుకున్న దగ్గరనుండి, గురువుగారు మార్కులు తెప్పించి, పాస్ చేయించి, ఉద్యోగాలో, వ్యాపారాలో చేయించాలి. దాంట్లో లాభాలు తెప్పించాలి. ఇదే మనకి గురువుని గూర్చిన అవగాహన. ఇది తప్పు. అందువలననే శ్రీ కృష్ణుడు యోగాభ్యాసానికి వైరాగ్యం తోడు కావాలన్నాడు. పతంజలి మహర్షి కూడా అదే నిర్దేశించాడు.

"నువ్వు కోరికలు ప్రక్కన పెట్టు. నేను నిన్ను దివ్యంగా తయారు చేస్తాను. అప్పుడు ఇవన్నీ సులభంగా తీరిపోతా" యని గురువు చెప్తాడు. మనం దేనికోసం అసలు ప్రయత్నం చేయాలో, అది చేయ కుండా, అక్కరలేని వాటిని గూర్చి ప్రయత్నం చేస్తాము. అవసరం లేని విషయాలు గూర్చి సద్గురువుని ఆశ్రయిస్తాం. ఈ భక్త సమాజాల్లో కోరికలు ఎక్కువయ్యి, సూక్ష్మ శరీరాలు సన్నగిల్లి భౌతిక శరీరానికి దెబ్బతగిలి సాధన జరగడం అటువుంచి, వున్నది కాస్త వూడిపోతున్నది. అదే, భౌతికశరీరం.

అందుకనే C.V.V గారు "నాకు దణ్ణం పెట్టినవాళ్ళు, మనసులో ఎటువంటి కోరికలు పెట్టుకోవద్దు. ఒకవేళ బలీయంగా మీ సంస్కారం లోంచి కోరికలు వస్తే, అవి ప్రార్థనా సమయంలో నాకు సమర్పణ చేయండి. అందులో మీకు శ్రేయస్సు కలిగించేవి నేను మీకు ఏర్పాటు చేస్తాను. శ్రేయస్సు కలిగించనివి, తీవ్రంగా మీ మనస్సుని బాధపెట్టేవి వుంటే వాటియందు మీకు మరపు వచ్చేట్లుగా మాయం చేస్తాను." అని చెప్పారు. సూక్ష్మ శరీర నిర్మాణానికి మొదటి మెట్టు "కోరికలు కోరవద్దు" అని చెప్పారు. "ఇదివరకు మనం చేసుకున్న కర్మను బట్టి,

ప్రస్తుతం జరుగుబాటు తప్ప, కోరినంత మాత్రాన కోరికలు తీరవు.'' అని చెప్పారు. ''కనుక ఇప్పుడు జీవితాన్ని క్రమబద్ధం చేసుకొని మార్పు చేసుకో. ఇప్పుడు క్రమబద్ధం చేసుకుంటే, ఐదారేళ్ళ తరువాత బాగుండవచ్చు. అంతేకాని ''జాతకాలు, నాడులు'' అంటూ ప్రపంచం అంతా తిరిగినా ఏం లాభం ? ఎంత తిరిగినా మనమేకదా వున్నది! మన స్వభావం అదే కదా! అందుకని మనని మనం బాగుచేసుకొని, మన ఇంట్లో మురికి మనమే తీసేసుకోవాలి. ఇది తీసుకోవడానికి ''బలము, స్ఫూర్తి నేనిస్తాను'' అని సద్గురువులు చెప్తారు. అంతే కాని, ''నీ చాకిరీ నేను చేస్తాను'' అని అనరు. అలా చేసిపెడితే చేయించు కోవడం తప్ప చేసుకోవడం తెలియదు. మనం చేసుకోవడం నేర్చుకుంటే ఇతరులకి కూడా చెప్పి చేయించే బలం, స్ఫూర్తి, మనలో ఏర్పడతాయి. చేసిపెట్టడం అనేది పసితనంలో వారికి. పసితనం ఎక్కువ రోజులు వుండదు. అలాగే వుండిపోవాలంటే కుదరదు. ఇంతకీ సద్గురువు మొదట చేసిపెట్టినట్లుగా కనిపించినా, నిజానికి చెయ్యడానికి కావలసిన పరికరాలని, తెలివిని అందిస్తాడు. మనం చేసుకోవాలి.

కుంభకోణంలో NRBV అనే ఒక వ్యక్తి నాడి చదివి అందరికి జరిగినవి, జరిగేవి చెప్పేవాడు. ఆయన ఒక రోజు మాస్టరుగారి జన్మ సమయాన్ననుసరించి నాడి చదివి, ఆనందపడి, హుటాహుటిని మాస్టరుగారి దగ్గరకు వచ్చి ''స్వామీ! మీరు పరబ్రహ్మమే రూపు కట్టుకొని వచ్చినట్లుగా నాడి తెలుపుతోంది'' అన్నాడు. దానికి మాస్టరు C.V.V. గారు నవ్వుతూ ''నే నెవరో, నీవు చెప్పటమేమిటి? నే నెవరో ముందు నాకు తెలుస్తుంది. తరువాత ఇతరులకు తెలియవచ్చు.

నేను బ్రహ్మము నని నీవు నాడి ద్వారా తెలుసుకోవటం వలన నీకేమీ సంప్రాప్తించదు. నీవు కూడా బ్రహ్మమే అని నీకు కూడా తెలియాలి కదా! అందుచే నాడీ గ్రంథాలన్నీ అటకెక్కించి, నేనందించే యోగంలో ప్రవేశించు. నీకు శుభం అవుతుంది'' అన్నారు. అంతే NRBV గారు యోగంలో ప్రవేశించి యోగ సాధకు లయ్యారు.

ఈ రోజు మాస్టరు C.V.V. గారి పుట్టినరోజు. కొద్దిమందికి వారి స్ఫూర్తి ప్రొద్దున్నే గుర్తువచ్చి ఉండవచ్చు. కొంతమందికి నిన్న సాయంత్రం నుండే శ్రద్ధ కలిగి ఉండవచ్చు. కొంతమందికి ఎప్పుడూ C.V.V. గారు ఉండవచ్చు. ఎంత గుర్తుంటే అంత సాన్నిధ్యం వుంటుంది. ఎంత సాన్నిధ్యం వుంటే అంత అయస్కాంతీకరణ జరుగుతూ వుంటుంది. అలా కాకుండా Part time గాను, అప్పుడప్పుడూ అంటే అయస్కాంతీకరణ జరగదు. కేవలం ''*స్మరణ*'' మాత్రం చేత ''*సాన్నిధ్యం*'' వుంటుంది. ఈ రోజు జరిగిన స్మరణ బాగా, రోజూ జరగాలి. మళ్లీ C.V.V. గారి పుట్టినరోజుకి మనలో ఈ మార్పు బాగా రావాలి.

''ఈవేళ నుండి కోరడం మానేసి జరుగుతున్నది అంగీకరిస్తాను. నా వంతు కర్తవ్యం నిర్వర్తించి, కోరడం మానేస్తాను.'' అని అనుకోవాలి. భగవద్గీత సారాంశం కూడా ఇదే. కర్మఫలము లందు ఆసక్తి లేకుండా కర్మ నిర్వర్తిస్తాను. దాని ఫలములయందు సంగం కోరను. కర్మను నేను నిర్వర్తిస్తాను. విద్యార్థికి విద్యాభ్యాసం, అస్వస్థులకు ఆరోగ్యం పదిలపరచుకోవడం, కుటుంబీకునికి కుటుంబ పోషణ కర్తవ్యాలు. ఫలాసక్తి లేని కర్తవ్య నిర్వహణ గావించే మగతనంకోసం సద్గురువు

వేచివుంటాడు. ఒక ప్రక్క మనం కోరుతూవున్నా, జరిగేదే జరుగుతుంది. కనుక జరిగేదే కోరుకుంటే మంచిది కదా!

కర్తవ్యం మాత్రమే నిర్వర్తించే నిష్కామ కర్మయోగమును ఒక్క ముక్కలో మాస్టరు గారు క్లుప్తీకరించి "ఇంక కోరక" అన్నారు. ఇంక కోరకుండా వుంటే సూక్ష్మ శరీరానికి కామ శరీరం అడ్డుపడదు. కాని ఇప్పటికే బాగా అడ్డుపడిపోయి, ప్రాణం క్షీణించి, దీనంగ ఏడుస్తూ "ఎందుకొచ్చిందిరా దేవుడా! అని జీవిస్తూ వుంటావే, అది నీకు పోగొట్టడానికే, నేనే ప్రాణాన్ని కూడా అందిస్తాను అన్నారు. "*Prana Treat, Yoga Teach*" అన్నారు.

ప్రాణాన్ని నీకు అందించి నిన్ను యోగంలో నిలబెడతాను. కాని నువ్వు నాకు ఇవ్వవలసిన వాగ్దానం ఒకటి వున్నది. 'అది ఏమిటంటే ఇంక కోరకుండా వుండటము. ఈ మార్గంలో నేను యోగాన్ని త్వరితగతిని అందించేటట్లు చేస్తాను." అన్నారు. "ఈ విషయం ఇదివరకు నుండి వుంది కదండీ" అంటే "ఉంది. అది నూతనం కాదు. నూతనం ఏమిటంటే ఆయన ఇచ్చిన శబ్ద తరంగాలు."

## C.V.V. శబ్దము :

ఈ "శబ్ద తరంగాలు" ఎక్కడి నుండి వచ్చాయో దానిని "*దత్తాత్రేయ మండలము*" అంటాము. దానిని ఆంగ్లంలో వారు "*సిరియస్ సిస్టమ్*" (Sirius System) అంటారు. "*భైరవ మండలము*" అని కూడా అంటారు. ఆకాశంలో అత్యద్భుతంగా వెలుగొందే సూర్య

మండలములలో అత్యుత్తమమైన సూర్య మండలమును "శారమేయ మండలము" అని సంస్కృతంలో అంటారు. ఆ మండలం నుండి ఈ ప్రజ్ఞ సరాసరి సింహరాశిలోకి దిగివచ్చింది. సింహరాశిలో చాలా నక్షత్రముల గుంపు వున్నది. అక్కడ చాలా సూర్యమండలములు వున్నాయి. అందులో వుండే సూర్య మండలాల్లోకెల్లా చాలా ఉత్తమ మైనది, కేంద్రమైనది ఒక మండలం వున్నది. దానిని గుర్తించి దానికి "రెగ్యులస్" (Regulus) అని పేరుపెట్టారు. (గుర్తించిన వారు వాళ్ల పేర్లు పెడ్తుంటారు. ఉదాహరణకి "హేలీస్ కామెట్" (Halley's Comet) దాని పేరు కాదు. హేలీ అనేవాడు కనుగొన్నాడు కాబట్టి తన పేరు దానికి పెట్టుకున్నాడు. అసలు మనకి మన పేరే మనం కాదు. అది పెట్టబడింది. అంతకన్నా ముందు కూడా వున్నదానిని, నేను కనుగొన్నాను, కనుక నా పేరు పెట్టడం- అనేది ఏమిటి? అసలు అది అంతకు ముందు నుండి వున్నదే కదా! అది మన మానవుల సంస్కారం.) ఇంతకి, ఈ సింహరాశిలో వున్న అత్యుత్తమమైన రెగ్యులస్ సూర్య మండలానికి ఒక సూర్యుడున్నాడు. సింహరాశిలో వుండే ఆ సూర్యమండలంలో నుంచి ఈ ప్రజ్ఞ దిగి వచ్చినదట. దత్తాత్రేయ మండలము నుండి, ఆ సూర్యమండలం లోకి, ఆ సూర్య మండలంలో నుంచి దిగి వచ్చినదట. దత్తాత్రేయ మండలము నుండి, ఆ సూర్య మండలం లోకి, ఆ సూర్యమండలం లోనుండి మన సూర్యమండ లానికి దిగి వస్తూవుంటే దాన్ని అందుకోవడానికి అగస్త్య ప్రజ్ఞ సరాసరి భూమిమీద శరీరాన్ని దాల్చవలసి వచ్చింది. మన మాస్టరు C.V.V. గారు అటువంటి అగస్త్య అంశ సంభూతులు.

ఎప్పుడైన, ఈ భూమికి విపత్కర పరిస్థితులు ఏర్పడినపుడు, అత్యుత్తమమైన చైతన్యమును సరఫరాచేసి తద్వారా ఉద్ధారణం చేద్దామనుకున్నప్పుడు అగస్త్య ప్రజ్ఞ దిగివచ్చింది. కాలకేయులనే రాక్షసులను, సూర్యవంశీయులు సంహరించడానికి కావలసిన తోడ్పాటు చేసినవాడు అగస్త్యుడు. సముద్రాన్నంతా అవపోసన పట్టి, ఈ సూర్యవంశీయులు, ఆ దాగియున్న కాలకేయులనే రాక్షసులని, సంహరించడానికి తోడ్పడినవాడు అగస్త్యుడు. అదీ యోగానికి సంబంధించిన విషయమే.

అధర్మ ప్రవర్తనగా మనలోపల కాలకేయులనే అసురులు వుంటారు. భయంకరమైన అసుర ప్రవృత్తి మనలో వుంటుంది. దానికి సంబంధించిన భావాలు మనలో పుడుతూ వుంటాయి. దానికి తగ్గట్టుగ మనం ప్రవర్తిస్తూ వుంటాము. దాని నుండి జీవుణ్ణి రక్షించుకోవాలంటే అక్కడికి సూర్యకిరణాలు చేరాలి. "సముద్రము" (ముద్రలతో కూడినది) అంటే ఎన్నో ముద్రలతో గజిబిజిగా వుండే మనస్సులోకి ఎంత గాయత్రి చదివితే మాత్రం వెలుగు ప్రవేశిస్తుంది? అసలు "మనం బుద్ధిని కోరుతున్నాం" అని గాయత్రి చేస్తున్నపుడు తెలియదు. "తత్ సవితృ వరేణ్యం" అని చదువుతాం. ఆ వెలుగు "నన్నావరించాలని అడుగుతున్నాం". ఎందుకంటే మన బుద్ధి బాగుపడాలని, అసలు మనం అర్థం చేసుకోకుండా చేస్తుంటే మనలో ఏ వెలుగూ పెరగదు. ఇంతకీ మనలో వుండే వ్యక్తిగత సమస్యలు, కోరికలు, ఇతరులమీద వుండే అభిప్రాయాలు ఇవన్నీ సముద్రపు అలలువలే హోరెత్తిస్తూ వుంటే మనం చేసే గాయత్రిమీద ధ్యానం ఏదీ? మనలో జరిగే ఈ భయం

కరమైన ఆలోచనా పరంపరల్ని ఎవరైనా మింగేస్తే సరాసరి గాయత్రి వెలుగు ఈ జీవుడనే సహజమైన బుల్లి వెలుగును చేరితే, వాడు పెద్దవాడు అవుతాడు. నువ్వూ సూర్యవంశీయుడవే. అగస్త్యుడు సముద్రాన్ని త్రాగడం అంటే మనలో, మనసులో ఏర్పడిన గజిబిజి నంతా "నేను మింగేస్తాను" అని చెప్పడం. ఇదివరకూ ఒక యోగి ఇలా ఉద్ధరించాడు. మళ్ళీ ఇప్పుడు ఉద్ధరించాల్సివచ్చి "మళ్లీ వచ్చాను, మింగుతాను" అని చెప్పాడు.

మాస్టరు C.V.V. అనే బీజాక్షరాలలోని శబ్దతరంగములు మన మనస్సులలో, మనలో సంస్కారవశమున ఏర్పడిన భావముల నంతా మింగివేస్తాయి. మనం అనేక జన్మల నుండి వచ్చిన కర్మలు అనే ఇంధనం లోపల బాగా పేర్చుకొని వుంచుకున్నాం. దాన్ని కాల్చేస్తాడట ఆయన. అది కాల్చడానికి ఈ మంత్రం. తొందరగా కాల్చేయడానికి మళ్లీ ఈ పద్ధతి పట్టుకొచ్చారు. "*It is a dynamic change to the Science of Yoga*" అని మాస్టరు E.K. గారే వ్రాశారు. అన్నీ పరిణామం చెందుతున్నాయి. కాబట్టి యోగవిద్య కూడా పరిణామం చెందింది. ఈ యోగం గురించి వివరిస్తూ C.V.V. గారు ఇలా అన్నారు. *It is neither post - ponement nor purging of Karma, but is neutralisation of it.* అంటే "నేను ప్రారబ్ధ కర్మను వాయిదా వేయను, ప్రచోదనము చేయను. కేవలం మీకోసం మింగేస్తాను" అన్నారు.

## నవ జ్యోతిషం :

డా॥ సర్వేపల్లి రాధాకృష్ణగారు మన్నించే తత్త్వవేత్త, సహాధ్యాయి పోతరాజు నరసింహంగారని, మాస్టరు C.V.V. గారి శిష్యులలో

ముఖ్యులు. ఆయన ఒకసారి, మాస్టరు C.V.V. గారికి "ప్రసిద్ధ జ్యోతిష్కులు ఈ విధంగా నా జాతకం గూర్చి చెప్పారు. మీరు సద్గురువులు, నేను మిమ్మల్ని నమ్ముకున్న వాడిని, మీ అభిప్రాయం తెలపండి." అని అడిగారట. "ఇక్కడ నమ్ముకుంటే, అక్కడెందుకు జ్యోతిష్యం చూపించావూ" అని C.V.V. గారు అడగరు. ఎందుకంటే, వారికి కరుణ, ప్రేమ వున్నది కనుక. కోపం రాదు కనుక. ఇంతకీ మాస్టరు గారు సమాధానంగ ఉత్తరం ఇలా వ్రాశారు. "జ్యోతిష్యం మారిపోయినది కదా! ఇదివరకు పనిచేస్తున్నట్లుగ, గ్రహాలు ఇప్పుడు పనిచేయడం లేదు. నేను వచ్చి మార్చేశాను. ఇప్పుడు వచ్చే కుంభ చైతన్యపు తరంగాలవల్ల, గ్రహాలకు కూడా క్రొత్త కర్తవ్యం వచ్చింది. పాతదాన్ని అంత ఖచ్చితంగ నమ్మకు. క్రొత్త జ్యోతిషం నేను చెప్తాను. ఇప్పుడు నీకు చెప్పినా అర్థం కాదు, కలిసినపుడు వివరిస్తాను." అని వ్రాసి క్రింద మరో పేరాలో "ఇటువంటి జ్యోతిష్యాన్ని ఇక ముందు నువ్వు నమ్మవద్దు. వాళ్లదగ్గరికి వెళ్లి నీ సమయాన్ని వెచ్చించవద్దు. ఇది నా సలహా. బావుందనిపిస్తేనే చెయ్యి, లేకపోతే ఫర్వాలేదు." అని వ్రాశారు.

"గ్రహములు యొక్క కర్తవ్యములు మారాయి" అని చెప్పి నటువంటి గురువు C.V.V. గారు. జ్యోతిష్యం మారిందని చెప్పి ఆ జ్యోతిష్యాన్ని మాస్టర్ E.K. గారి ద్వారా "*Spiritual Astrology*" గా C.V.V. గారు అందించారు. ఆ గ్రంథము ముందుమాటలో "*These are from those whom I follow to those who follow me*" అని వ్రాశారు. మిగతా జ్యోతిష్యం పాతది. ఈ జ్యోతిషం క్రొత్తది. దీని ప్రకారం ఇప్పుడు గ్రహాలు పనిచేస్తున్నాయి. ఇదివరకు కుంభయుగం

వచ్చినపుడు కూడ అలాగే జరిగింది. మాస్టరుగారు అందించిన జ్యోతిషములో శని, వరుణుడు, కుజుడు ప్రముఖ పాత్రలను పోషిస్తున్నట్లు తెలుస్తుంది.

సూర్య చంద్రుల నుండి కూడ, వరుణగ్రహ ప్రభావం జీవుల కందుతున్నట్లు తెలుస్తుంది. స్థిర రాశులైన వృషభము, వృశ్చికము, సింహము, కుంభము ఈ యుగపు యోగసాధనకు మిక్కిలి అనుకూల రాశులుగా తెలుస్తుంది. జ్యోతిషము, షట్చక్రముల అనుబంధము ప్రాముఖ్యత వహిస్తుంది. శ్రావణ పూర్ణిమ (మాస్టరుగారు జన్మించిన పర్వదినము) 'గురు పూర్ణిమ'గా పరిగణింప బడుతుంది. ఇవే విషయాలు C.V.V. గారి తరువాతి కాలములో పరమగురువు జ్వాలాకూలుడు '*ఆధ్యాత్మిక జ్యోతిషం*' (Esoteric Astrology) అనే గ్రంథంలో కూడ వివరించారు.

## యోగాశయాలు :

మాస్టరుగారు ప్రాణ తరంగాలను నూతన పద్ధతిలో ప్రవేశ పెట్టి, కామ శరీరం దగ్ధం చేసే కార్యక్రమం ఒకటి, సూక్ష్మ శరీరాన్ని పటిష్ఠం చేసే కార్యక్రమం ఒకటి, భౌతిక శరీరం నిరంతరం ఏ అడ్డంకి లేకుండా పనిచేయడం ఒకటీ- ఇలా మూడు రకాలుగా యోగాన్ని మలచి దానిని మన కందించారు.

## సంప్రదాయం :

గాయత్రి వద్దనలేదు గాని చేసుకోనవసరం లేదన్నారు. ఏ మంత్రము చేసుకోవలసిన అవసరం లేకపోయినా, నీ సంస్కార వాసన

నిన్ను బాగా పీకుతూ వుంటే చేసుకోమన్నారు. మాస్టరు E.K. గారికి గాయత్రి చేస్తుంటే C.V.V. గారు కనిపించారు. కాబట్టి గాయత్రి కూడ చేసుకున్నారు. ఆయన గాయత్రి చేయకపోతే C.V.V. గారు దొరికేవారు కాదేమో! తాను గాయత్రి మంత్రం చేస్తూ, దానిలో తన్మయం చెందిన సమయంలో మాస్టరు C.V.V. దివ్య శరీరధారులై కనిపించారు. అంటే 'నేనే గాయత్రి' అని చెప్పడానికే వచ్చారని, గాయత్రి వ్యక్తరూపమే మాస్టరు C.V.V. అని తెలుసుకున్నారు. "*నాకు ఏ మంత్ర కారణంగా దివ్య చైతన్య ప్రసారం జరిగి, నా జీవితం దివ్యత్వం చెందిందో ఆ మంత్రాన్ని కూడా నేను ఉపాసిస్తాను*" అన్న భావంతో E.K. గారు గాయత్రిని కూడా చేశారు. కనుక "*మాస్టరు C.V.V. అన్నా, గాయత్రి అన్నా ఒకటే*" అని తెలిసి చేసుకుంటే మంచిది.

అసలు మాస్టరు C.V.V. గారు, ఆయనలోకి ఈ దివ్య చైతన్యం దిగి వచ్చేంత వరకు కూడ, ఎప్పుడూ కృష్ణుని పూజలు చేసేవారు. చక్కని, సుందరమైన, త్రిభంగి అయిన శ్రీకృష్ణుని విగ్రహానికి 42 సం॥ల వరకూ పూజ చేయని రోజుండేది కాదట. మొదట 42 సం॥లలో సమస్త వేదములను ఆయన ఆకళింపు చేసుకొని, ఆంగ్ల భాష నేర్చుకొని, దివ్యజ్ఞాన సభ్యుడిగా వుంటూ, తంజావూరు రాజుగారితో కబుర్లాడుతూ, సంగీత శాస్త్రాన్ని బాగా అధ్యయనం చేస్తూ, కుంభకోణం మేయరుగా కూడ పనిచేసి, రైల్వే కాంట్రాక్టులు చేస్తూ, దివ్య భోగాలతో వుండేవారు. ఒక విధమైన వైభవోపేతమైన జీవితం గడిపారు. చేయవలసిన కర్తవ్య మంతా దివ్యంగా నిర్వర్తించారు.

ఈ దివ్య చైతన్యం ఆయనలో ప్రవేశించగానే, తానిక "అది" అయిపోవడం చేత, ఇవన్నీ ప్రక్కన పెట్టేశారు. కృష్ణుని విగ్రహానికి ప్రతిరోజు పూజలు చేయడానికి ఒక శ్రోత్రియుడైన బ్రాహ్మణుని నియమించి, తాను యోగము నందు పరిపూర్ణంగా నియమింప బడ్డారు. ఇంట్లో విగ్రహం వున్నదంటే, అది విగ్రహం అని కాక, సజీవంగా భావించి స్నాన పానాదులు, ఉపచారములు చేయవలెను తప్ప ఇంట్లో ఏమీ చేయకుండా అలా పెట్టుకోకూడదు. అంతవరకూ, మాస్టరుగారు కృష్ణ భక్తులు. అటుపైన తానే బ్రహ్మము. కనుక 'తిరుమలలో దణ్ణం పెట్టండి' అంటే 'ఎవరికి' అని అడిగారట! అంటే అక్కడున్నది, ఈయన ఒకటే. అంతటి ప్రజ్ఞ మాస్టరు C.V.V.

## యోగము, వేగము :

శ్రద్ధా భక్తులతో మాస్టరుగారి యోగము చేసుకుంటూ వుంటే, మనలో మార్పులు జరిగి 10, 12 సం॥ల కార్యక్రమము ఒక సం॥లో జరిగేటట్లు ఆయన ఏర్పాటు చేస్తారు. కుంభయుగం (Aquarian Age) యొక్క మరియొక స్వభావం ఏమిటంటే, జన్మల పరిణతిని త్వరితగతిని ఒకే జన్మలో చేసే ఏర్పాటు. ఇప్పుడు పిల్లలు పుట్టగానే చూడడం, 10వ క్లాసులోనే బి.ఏ. పాఠాలు చదవడం... ఇలా జరుగు తున్నదంటే కుంభవేగం అన్నమాట. ఇవన్నీ మాస్టరుగారు తీసుకొచ్చిన తరంగముల ద్వారా ఏర్పడుతున్న తీవ్ర మార్పులు. అవే శరీరములో కూడా ఏర్పరుస్తానని చెప్పారు. కనుక దానిని విధి విధానంగా మనం నిర్వర్తించుకోవాలి. అవగాహన వుంటే, దాని యొక్క గంభీరత తెలిస్తే, దాని యందు మనకి శ్రద్ధ పెరుగుతుంది.

నిజానికి ఈ నూతన (కుంభ) చైతన్యం ప్రవేశ పెట్టినప్పటినుండి జాతి జీవన విధానంలో పెను మార్పులు అతి వేగంగా జరిగాయి. 20వ శతాబ్దములోని పరిణామాలు, గత 10 శతాబ్దములలో జరిగిన మార్పుల కన్నా ఎక్కువ. అన్నీ తేలిక పడుతున్నాయి. దుస్తులు, మనం వాడే చెంబులు, గిన్నెలు, వాహనాలు, ఇతర పరికరాలు చాలా తేలిక అయినాయి. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రాన్‌కు సంబంధించినది. ఎలక్ట్రాన్, యురేనస్‌కు సంబంధించినది. యురేనస్ ఎనర్జీ ఎక్వేరియస్‌కు సంబంధించినది. నిజానికి మాస్టరు C.V.V. గారి హృదయ పద్మం నుండి ఈ వరుణ గ్రహ తరంగాలు ప్రసారం అవటం చేతనే, యోగంలో కూడా శీఘ్ర పరిణామాలు జరుగుతున్నవి. అణుచ్ఛేదం, అంతరిక్ష పరిశోధనలు, అమితమైన సూక్ష్మ జ్ఞానం శాస్త్రంలో చోటు చేసుకోవటం, వరుణుని ప్రభావమే. వరుణ శక్తి లోలోనికి ఛేదించు కుంటూ పోతూ సమస్త జ్ఞానాన్ని, మానవున కందిస్తోంది. యోగ విద్యకూడా అంతర్ముఖ సాధనే గావున త్వరితగతిని లోపలి విషయం సాధకులకు తెలుస్తుంది.

## అనుసరణ, అనుకరణ :

మాస్టరు గారు చెప్పిన "ఇంక కోరక" అనేది చేయాలంటే, కోరికలన్నీ ఆయనకి అప్పచెప్పేయండి. "నాకీ కోరికలు వున్నాయి. అందులో ఏవి పనికి వస్తాయో, ఏవి పనికిరావో నాకు తెలియదు. అవన్నీ తీర్చినా, తీర్చక పోయినా మీకే అవి సమర్పణ" అని తెలుపు కోవాలి. మాస్టరుగారి మార్గంలో "సమర్పణ" చెందాలి. అంటే అన్నీ, (సమస్యలన్నీ) అక్కడ పెట్టాలి. ఊరిలో ఎవ్వరినీ అడగ కూడదు.

మాస్టరు E.K. గారు కోరికలు లేవు కదా అని పగలు, రాత్రి నిద్ర పోలేదు. చాలా పనిచేశారు. కానీ తనకేమీ కావాలని చేయలేదు. కృష్ణుడు చెప్పినా, గౌతమబుద్ధుడు చెప్పినా, ''బాగా కోరికలు వున్నవాడు ఎంత తీవ్రంగా పనిచేస్తాడో, నువ్వూ అంత తీవ్రంగా పనిచెయ్యి. ఫలితములయందు ఆసక్తి వద్దు. ఫలాపేక్ష లేకుండా అంత పని చెయ్యాలి'' అని చెప్పారు. మాస్టరు E.K. గారు ఈ విధంగా జీవించి చూపారు. ఆయన ప్రాతఃకాలాన లేచిన దగ్గర నుండి ఇతరుల శ్రేయస్సుకోసం పని చేసేవారు. తనకని ఆయన ఏమీ కోరలేదు. అది మనకి ఉదాహరణ. ఎల్లప్పుడూ ఒక మహాత్ముడు వచ్చి మనతో పాటు జీవిస్తే ఆయన ఎలా నిర్వర్తించారో అలా జీవించడానికి అనుసరణ వుండాలే తప్ప, అనుకరణ వుండకూడదు. ''అనుసరణ'' స్ఫూర్తికి సంబంధించినది. ''అనుకరణ'' బాహ్యమైన నటనకు సంబంధించినది. అందుకే మాస్టరుగారిలా వుండడానికి అనుసరణ చేయండి. అనుకరణ చేయవద్దు. ఇది అంతర్గతమైన విషయం. అర్థవంతము గూడ.

C.V.V. గారిలా మాస్టరు M.N. గారు లేరు. M.N. గారిలా మన మాస్టరు E.K. గారు లేరు. ఎవరంతటివారు వారే. రాముడిలాగ కృష్ణుడు లేడు, పరశురాముడిలాగ రాముడు లేడు. అందరూ విష్ణువు అవతారాలే. ఏ జీవుడికి, వాడికి వాడికే ఒక ప్రత్యేకమైన, వినూత్నమైన, వాడిదైన పద్ధతి ఉంటుంది. రామకృష్ణ పరమహంస, షిరిడీసాయి, రమణ మహర్షి, మాస్టరు C.V.V. వీరంతా ఒకే సమయంలో వున్నారు. కాని ఒకేలా లేరు. అంతా సత్యం తెలిసిన వారే. అదీ జీవలక్షణం. నీ

జీవలక్షణంతో మూలసూత్రాన్ని అనుసరించాలి. "ఆయన పరోపకారం చేశారు. నేనూ చేస్తాను" అనుకోవాలి. కాని "మక్కికి మక్కి" అని అనకూడదు. అది నీ జీవ లక్షణానికి కుదరకపోతే ఘర్షణ తెచ్చి పెడుతుంది. మాస్టరు C.V.V. గారిని, మాస్టరు E.K. గారు అనుసరించారు. అలాగే మాస్టరు E.K. గారిని మనం అనుసరిద్దాం. అలా చేస్తే దివ్యంగా తయారవుతాం. ఆ విధంగా మనకు C.V.V. గారి ప్రజ్ఞ ఫలితాన్నిస్తుంది.

## తల్లి - తండ్రి - గురువు :

మొత్తం ఈ సూర్యమండలానికి తల్లి, తండ్రి ఇద్దరున్నారు. మనకున్నట్లే సృష్టికి కూడా వున్నారు. సృష్టికే తల్లీ, తండ్రి వుంటే సృష్టిలో భాగమైన సూర్య మండలానికీ వుంటారు కదా! ఈ సూర్యమండలానికి తండ్రి "*సప్త ఋషిమండలం*", అందుకే దీన్ని గురుపరంపరలో తల్చుకుంటారు. తల్లి "*కృత్తిక మండలం*", "*దత్తాత్రేయుడు*" గురువు.

ఆ త్రిమూర్త్యాత్మకమైన దత్తాత్రేయుని ఉద్దేశించి, మనం చదివే '*గురుః బ్రహ్మ, గురుః విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః*' మంత్రం ఇవ్వబడింది. నీ గురువు కూడా అదే. ఎక్కడ నుండి వచ్చినా గురుతత్త్వం ఒకటే. ఈ సూర్యమండలానికే గురువైన దత్తాత్రేయ మండలం నుండి సరాసరి దిగివచ్చిన అవతార తత్త్వంగా, అగస్త్యాంశగా మాస్టరు C.V.V. గారిని పూజించడం మొదటి విషయం. అది అంతరిక్షం నుండి సింహ రాశికి దిగివచ్చింది. అది వుండేది వృశ్చిక రాశియైనా, ఎన్నుకున్నది సింహరాశి. అందుకనే సింహరాశి, వృశ్చికరాశి గురువులు ఇకముందు

ఉధృతంగా మానవజాతిని ఉద్ధరిస్తారు. అన్ని చోట్ల నుండి, అన్ని రకాలుగా వస్తారు. సత్యసాయి వృశ్చికరాశి నుండి వచ్చారు. C.V.V., M.N., E.K., H.P.B., అరవిందులు సింహరాశి నుండి వచ్చారు.

## స్థిరరాశి ప్రభావం :

తరింపు కావాలనుకుంటే మనుష్యులు వారివారి జన్మజాత కాలలో జన్మకుండలిలో కనుక స్థిరరాశులలో లగ్నము, చంద్రుడు, సూర్యుడు వుంటే వాళ్లు ఖచ్చితంగా ఈ మార్గంలోకి రాగల అవకాశం వుంది. అలా లేకపోతే గోచారం (Progression)లో వృషభంలో కానీ, వృశ్చికంలో గానీ, సింహంలో కానీ, కుంభంలో కానీ లగ్నం, చంద్రుడు లేక సూర్యుడు ప్రవేశించే సందర్భంలో తప్పక ఈ యోగంలో ప్రవేశించి పరిణతి చెందడానికి అవకాశం ఏర్పడుతుంది అన్నది క్రొత్త జ్యోతిష్యం.

## ఎక్వేరియన్ ప్రయోగాలు :

హేలీ తోకచుక్క ఈ భూమికి, 1910 మార్చి 31న బాగా దగ్గరగా వచ్చింది. మార్చి 31 సాయన మేషమాసం అవుతుంది. సాయన చైత్రమాసం మార్చి 21 నుండే మొదలౌతుంది. 21 నుండి 9 రోజులు అంటే 30 అర్ధరాత్రినాడు ఈ తోకచుక్క భూమిని తాకింది. (మళ్ళీ 1986లో వచ్చింది, కానీ తాకలేదు.) అందులోంచి అందివ్వబడిన ఆ ప్రజ్ఞని C.V.V. గారు అందుకున్నారు. అందుకోవడం చేత ఆయన దివ్యమైన తేజస్సుతో, బాగా కాంతివంతంగా, చూపరులకు కొంచెం ఆశ్చర్యం కలిగించేటట్లుగా కనిపిస్తూ వుండేవారు. 50 రోజులలోపు దీనిని పూర్తిగా అవగాహన చేసుకున్నారు. దాదాపు 12 సం॥లు భూమికి, భూమి జీవులకు అందించారు.

దీన్ని అవగాహన చేసుకోవడం కోసం, పరతత్త్వమే మరల తనకి బిడ్డగా దిగివచ్చింది. అదే 'చందు' అనే ప్రజ్ఞ. చందు అనే ప్రజ్ఞ తన భార్య శరీరంలో వున్నప్పుడే, ఆ ప్రజ్ఞని అందులోంచి బయటకు తీసి, దానితో చాలా ప్రయోగాలు చేశారు. "ఈ భూమికి వుండే అవకతవకలు ఏమిటి? అవి మనిషిని ఏవిధంగా బాధిస్తున్నాయి? ఈ సూర్యమండలంలో వుండే అవకతవకతలు ఏమిటి? అవి ఏవిధంగా మనిషిని బాధిస్తున్నాయి? మానవుని పరిణామానికి ఏవిధంగా అడ్డుపడుతున్నాయి?" వీటికి సంబంధించిన ప్రయోగములు విపరీతంగా మాస్టరుగారు చేశారు. దానికి సంబంధించిన ఒక నోట్సు రాసుకుంటూ వుండేవారు. అది ఆయనకి పనికి వచ్చేది. మనకా నోట్సు నిరుపయోగము.

గొప్పకు చాలా మంది ఈ నోట్సు గురించి మాట్లాడుతారు. వాటిని ప్రచురిస్తున్నారు గూడ. కాని అందులో విషయాలు ఎవ్వరికీ అంతుబట్టేవి కావు. అవి ఆయనకు చెందిన వ్యక్తిగతమైన నోట్సు. అవి దగ్గర వుంచుకొని పొంగిపోతూ భ్రమకు లోనవుతున్నవారు కూడ వున్నారు. మాస్టరుగారు, ప్రతివారి భౌతిక శరీరం నుండి సూక్ష్మశరీరం విడదీసి దాంట్లో వుండే జన్మ జన్మల రహస్యాలని పట్టుకొని దాని ప్రకారం యోగం అందిస్తూ వుండేవారు. ఆయన చాలా పెద్ద శాస్త్రవేత్త (Scientist). అలాగే ఈ చందు అనే ప్రజ్ఞని అంతరిక్షంలో ప్రవేశపెట్టి అక్కడి నుండి వచ్చే తరంగాలు మన సూర్యమండలములో ఈ గోళాలకు అందుతూవుంటే, అక్కడి నుండి ఏవిధంగా వక్రీకరించాయి, అనే విషయాలు బాగా గమనించారు. ప్రత్యేకించి శుక్రునికి, శనికి

సంబంధించిన గ్రహముల యొక్క కిరణములు మనకి అందే విషయంలో చాలా కృషి చేశారు.

ఎందుకంటే, శనిగ్రహం భౌతిక శరీరానికి సంబంధించినది. శుక్రగ్రహం మనలో వుండే సూక్ష్మ శరీరానికి సంబంధించినది. కాబట్టి ఈ దివ్యశరీర నిర్మాణానికి కావలసిన దంతా శుక్రుని దగ్గర నుండి వచ్చే కిరణాల ఆధారంగా వస్తూ వుంటుంది. అదే మనకి ఇదివరకు గ్రంథాలలో శుక్రాచార్యుల దగ్గర 'మృతసంజీవని' విద్య వుందని, దేవతలు బృహస్పతి కొడుకుని ఆ విద్య నేర్చుకోవడానికి పంపారని కథ వున్నది. అదే విద్యని కఠోపనిషత్తులో 'నచికేత విద్య'గా ఇచ్చారు. సావిత్రి ఉపాఖ్యానంగా, మార్కండేయ జీవిత చరిత్రగా కూడా ఇచ్చారు. ఇందులో వున్నది మరణాన్ని దాటే రహస్యము. ఆ రహస్యాన్ని మాస్టరుగారు మళ్ళీ అందుకొని, తనిచ్చే శబ్దతరంగాల్లో దాన్ని ప్రవేశపెట్టడానికి, శుక్రగ్రహంతో పనిచేసిన సందర్భాలున్నాయి. శనిగ్రహం ఒప్పుకోకపోతే శుక్రగ్రహం ఏమీ చేయలేదు.

మనకి ఉండే భౌతిక జీవితం నుంచి, మనలను వేరుచెయ్యాలంటే వేరుశనగ కాయ నుండి పప్పును తీయడం లాంటిది. కాయ పండకపోతే పప్పు చితికిపోతుంది. కొబ్బరికాయలో కొబ్బరిలాగ విషయం అతుక్కుని వుంటుంది. అతుక్కున్నదాన్ని వేరు చేయాలి. అలా చేయాలి అంటే అది పండాలి. దానికి ఒక కార్యక్రమం వుండాలి. అదే శనిగ్రహంతో మాస్టరుగారు చేసిన పని. అదే శనిగ్రహంతో మనకి బలం అందించడం, మనలో 'ఇష్టం లేక పోవడం' అనేది లేకుండా

చేయడం. ఇలాంటివి చాలా వున్నాయి. ''శనిగ్రహానికి సంబంధించిన శిక్షణ, శుక్రగ్రహానికి సంబంధించిన అనుభూతి'' ఈ రెండూ మనకి కావలసిన ప్రయోగాలు, ఈ చందు అనే బిడ్డతో ఆయన చేశారు. ఆ పిల్లవాడికి 3 నెలల వయస్సు వచ్చేంతవరకు ఈ కార్యక్రమములు జరిగాయి. వీళ్ళిద్దరు ఎన్నెన్నో విషయాలు మాట్లాడుకొనేవారు. భార్య అప్పుడప్పుడు గదితలుపు తీసి చూస్తుంటే వీళ్ళు అద్భుతమైన విషయాలు చర్చిస్తుండేవాళ్ళు. 3 నెలల పిల్లవాడు! ఈ గురువుగారు చేసే చర్య ఎవరికీ అంతుపట్టే విషయం కాదు. చెప్పినా నమ్మేవిషయం కాదు. అటుపైన ''అర్ధరాత్రి ఈయన మేల్కొని గదిలో ఏం చేస్తున్నారో చూద్దామని'' భార్య వెంకమ్మగారు తలుపు తీసి చూస్తే అప్పుడప్పుడు ఎవరెవరో మహర్షులు వచ్చి కూర్చున్నట్లుగా కనిపించేది. ''ఎవరు వీళ్ళంతా? రాత్రి వస్తున్నారు'' అని అడిగితే, ''వాళ్ళంతా హిమాలయాలనుండి వచ్చే ఋషులు. నాతో సంప్రదించడానికి వస్తున్నారు'' అని చెప్పేవారు.

ప్రతి రాత్రి హిమాలయాల నుండి గడ్డాలవాళ్ళు, మీసాల వాళ్ళు, ఆజానుబాహులు, విపరీతమైన తెల్లని వెలుగుతో కూడిన వాళ్ళు వచ్చి, C.V.V. గారి గదిలో సమావేశమై ఆయనతో చర్చలు జరిపేవారు. అవన్నీ మనకి జ్వాలాకూలుని పుస్తకాలు చదివితే బాగా అర్థం అవుతాయి. ఆయన యొక్క "***Avathar of synthesis***" అనే అంశంలో, C.V.V. గారు చేసిన పనులన్నీ రాశారు. అందుకని జ్వాలా కూలుని గ్రంథాలు అర్థం కావడానికి తాళం చెవి, మన మాస్టరు గారి వద్ద వున్నది.

## మే కాల్ :

చైత్రమాసం 9వ రోజు నుండి జ్యేష్ఠ పౌర్ణమి వరకు పెంతకోస్తు (Pentacoast) అనే అద్భుతమైన ఒక కాలచక్రం వున్నది. ఇది క్రైస్తవము నకు సంబంధించినదే అనుకోవద్దు. మనవారు కూడా చైత్ర పాడ్యమి నుండి జ్యేష్ఠ పౌర్ణమి వరకు పర్వదినాలుగా గుర్తించారు. చైత్రం, వైశాఖం, జ్యేష్ఠం ఈ మూడు నెలలూ చాలా పర్వమాసాలు. జ్యేష్ఠ మాసంలో మనకి మే కాల్ డే నాడు, మే 29న మాస్టరుగారు, 'C.V.V.' అనే ఉపదేశ మంత్రాన్ని అందించారు. ఆయన అందుకున్నది చైత్రమాసంలో. ఆయన ఆకళింపు చేసుకొని ప్రయోగాలు చేసింది చైత్ర, వైశాఖమాసాల్లో. జ్యేష్ఠమాసంలో ఆ ప్రజ్ఞను భూమికి అందించ డానికిగాను 'మే కాల్' పెట్టారు. 29 మే మిథున మాసంలోకి వస్తుంది. సాయన మిథున మాసాన్ని "Gemini" అంటారు. ఆ Gemini విశుద్ధిని ప్రచోదనం చేస్తుంది. జీవుడు, మూలాధారంలో వుండేవాడు "శబ్ద తరంగాన్ని ఆధారంగా" చేసుకొని ఉద్ధరణ చెంది విశుద్ధిలోకి వస్తాడు.

ఇదే 'నచికేత విద్య'గా ఇచ్చారు. "మూలాధారం నుండి జీవుడు 'చిత్రిణి' అనే నాడిని పట్టుకొని ఊర్ధ్వముఖంగా ప్రయాణం చేసి, విశుద్ధిలో కూర్చొని చుట్టూ వుండే ఆకాశాన్ని ధ్యానం చేసే స్థితిలోకి వస్తాడు." అని నచికేత విద్యలో వున్నది. అదే జ్ఞానాన్ని మాస్టరుగారు ఈ తరంగముల ద్వారా మనల్ని (మూలాధారంలో బంధింపబడ్డ జీవుడిని) స్వాధిష్ఠానము, మణిపూరకము, అనాహతము దాటించి విశుద్ధిలో కూర్చోపెట్టి ఆకాశ తత్త్వాన్ని మనం అవగాహన చేసు కొనేట్టుగా నిర్ణయించారు.

"Gemini" మాసం వాయుతత్త్వపు రాశి. ఆయన చైతన్యము అయిన కుంభచైతన్యమూ వాయుతత్త్వమే. కనుక ఈ చైతన్యమును తీసుకు వచ్చిన మాస్టరుగారు వాయుతత్త్వాన్ని ఆధారంగా చేసుకొని, ఆ వాయువునే వినియోగించి, మనల్ని ఒక్కసారి అక్కడి నుండి పైకి లాగడానికి ఒక ప్రక్రియ ఇచ్చారు. ఇదే రామాయణం కూడా! రామాయణములో గురువైన హనుమంతుడు వాయుపుత్రుడు.

హనుమంతుడు దైవదూతగా జీవుని (సీత) వద్దకు వస్తాడు. భగవంతుని సందేశం కొనివస్తాడు. జీవునికి దైవస్ఫూర్తి, ప్రేరణ, ఆనందం అందిస్తాడు. సీత లంకలో అంటే ద్వీపంలో బంధింప బడింది. లంక అంటే నీటిచే వేరుచేయబడిన ప్రదేశము. జీవుడు కూడ కోరిక కారణంగా దేవుని నుండి వేరుచేయబడతాడు. సీతాదేవి కూడ లేడిని కోరి రామునికి దూరం అయింది. మనమూ అలాగే దైవానికి దూరమై త్రిగుణములచే బంధింపబడి, అటుపైన ఇంద్రియ ముల చేత, శరీరంచేత బంధింపబడతాము. నీరు లంక నేర్పరచినది. మన ఆవేశకావేశాలు మనలను త్రికూటములో గల లంకలో పడవేసినది. పరిష్కారము వాయునందనుడే. మనలోని వాయువును (శ్వాస) ఆధారంగా చేసుకొని మరల 'మూల'లో బంధింపబడిన మనం ఊర్ధ్వగతి చెందాలి. వాయుపుత్రుని ప్రవేశము ప్రాణాయామమునకు సంబంధితము. కోరిక కారణంగా వేరు కాబడిన సీత, పశ్చాత్తప్తయై వైరాగ్యము చెంది, రాముడే శరణ్యమని జీవిస్తున్న తరుణంలో వాయుపుత్రుడు తారసపడి పరిష్కార మార్గమిస్తాడు. సీత రాముని చేరినది.

అలాగే కోరికల నుండి కడతేరి దైవమే పరిష్కారము అనుకొనే జిజ్ఞాసికి యోగవిద్య, గురువు తారసపడతారు. కుంభచైతన్యం వాయు తత్త్వం ప్రధానంగా గలది. మానవుడు ఖనిజములు, వృక్షములు, జంతువులు తరువాతివాడు. అనగ నాలుగవ వాడు. వాయువు కూడ పంచభూతములలో పృథివి, జలము, అగ్ని తరువాత నాలుగవది. యోగములో యమము, నియమము, ఆసనము అను అంగముల తరువాత నాలుగవ అంగము ప్రాణాయామము. కుంభ చైతన్యము నకు సంబంధించిన అంకె నాలుగు. అందుకే మాస్టరు C.V.V. గారు 4వ తేదీన జన్మించారు. కుంభచైతన్యాన్ని అందించడానికి ధనిష్ఠలో జన్మించారు. అంటే సంపద నందించే వాయువులో జన్మించారు. అది కారణంగా రాజయోగాన్ని అందించారు. యోగమే నిజమైన సంపద.

వారు కుంభచైతన్యమును, మిథున రాశిద్వారా జీవుల కందించి, జీవులను తులారాశి ప్రభావము నుండి ఉద్ధరించదలచి మే 29వ తేదీని ఉపదేశానికి అనుకూలమైన రోజుగా ఎంచుకున్నారు.

తులారాశి, మిథునరాశి, కుంభరాశి వాయుతత్వపు రాశులు. తులలో జీవుడు కోరికలతోను, భావావేశాలతోను బద్ధుడై, ఇంద్రియ లోలుడై వుంటాడు. Passion, Desire, Indulgence తులా రాశికి ఎక్కువ. అందుకే ఈ రాశిలో దుర్గపూజలు ఋషులు రూపొందించారు. మనలో మహిషం, అంటే దున్నపోతును, దుర్గ సంహరిస్తే మనం సుఖపడతాం. లేకపోతే సుఖం పేరున దుఃఖ పరంపరలను ఏర్పరుచుకుంటాం. దుర్గ పూజద్వారా ఈ చీకటిని దాటి వెలుగులో ప్రవేశించటం, శరన్నవరాత్రి ఆరాధనల ఉద్దేశ్యము.

తులారాశి నుండి, బీజాక్షరముల ద్వారా ఊర్ధ్వమునకు కొనితెచ్చుట మాస్టరు C.V.V. గారి యోగ ప్రక్రియ. అందుకే వారు C.V.V. అను బీజాక్షరముల నందించారు. ఈ అక్షరములను, అందించిన దీక్ష ప్రకారము ఉచ్చరించువారిని, మూల నుండి విశుద్ధికి, అనగ, పృథివీ తత్త్వము నుండి ఆకాశ తత్త్వానికి మాస్టరుగారు ఉద్ధరిస్తారు. మిథునంలో ''మేకాల్'' ప్రత్యేకత ఇదే. ఇట్లు ఉద్ధరింప బడుటచే ఆకాశ శరీరం, లేక సూక్ష్మశరీరం త్వరితగతిని నిర్మాణం అవుతుంది. జ్ఞానవాశిష్ఠంలో కూడ ముందు అందించిన కథ యిదియే. ఆకాశజుడనే రాజు కథగా ఈ విద్య తెలుపబడింది. అటుపైన మిథునరాశి నుండి కుంభరాశికి అనగా మనలోని ఆజ్ఞా కేంద్రముకన్న పై నున్న కేంద్రములలోనికి మాస్టరుగారి యోగము క్రమశః ప్రవేశం కల్గిస్తుంది. అన్ని విషయాలూ ఉపన్యాసము ద్వారా స్వల్ప వ్యవధిలో తెలుపలేను. సాధన చేసిన కొలది లోపలినుండి అన్నీ తెలుస్తాయి. చివరకు సాధకునికి మార్కండేయ మార్గము- అనగ మరణ రహస్యము, అటుపైన వేనుని మార్గము - అనగ మరణము నుండి పుట్టుక మార్గము కూడ తెలియగలదు. అంతము, ఆది అను దైవమాయ నధిరోహించి చిరంజీవియై సృష్టియందు జీవుడు మనగలడు. సనక సనందనాదులు, వశిష్ఠ, అగస్త్యులు, నారదాది ఋషు లట్టివారే.

మాస్టరుగారు పై విధముగ యోగమార్గమును, ఈ కాలము జీవులకు సులభతరము గావించినారు. అందరము ఆ చైతన్యంలో ప్రవేశించుదాము, జీవించుదాము. శాశ్వతు లగుదాము. ఈ సంకల్పం దృఢ పడుటకే మాస్టరుగారి పుట్టినరోజు మనం నిర్వర్తించు కుందాము.

*ఇతి శుభమ్ !*

# మర్మమంత్రములు

## *Mystic Mantrams of* **Master C.V.V.**

## మాస్టర్ సి.వి.వి. మర్మమంత్రములు

| | |
|---|---|
| **Namaskarams Master....** | నమస్కారమ్స్ మాస్టర్.... |
| Dip Deep | డిప్ డీప్ |
| Axis Arranged Hours | యాక్సిస్ ఎరేంజ్డ్ అవర్స్ |
| Higher Bridge Beginning | హయ్యర్ బ్రిడ్జ్ బిగినింగ్ |
| Truth Levels | ట్రూత్ లెవెల్స్ |
| Nil None Naught Levels | నిల్ నన్ నాట్ లెవెల్స్ |
| Normal Temperament | నార్మల్ టెంపరమెంట్ |
| Time Expand | టైమ్ ఎక్స్‌పేండ్ |
| Electric Hint | ఎలక్ట్రిక్ హింట్ |
| Ether Work Out | ఈథర్ వర్కౌట్ |
| Equator Equal | ఈక్వేటర్ ఈక్వల్ |
| Pituitary Hint | పిట్యూ్యటరీ హింట్ |
| Hidden Circumference | హిడెన్ సర్కంఫరెన్స్ |
| Side Ways | సైడ్ వేస్ |
| Miller Form Centre | మిల్లర్ ఫార్మ్ సెంటర్ |
| Vertical Levels | వర్టికల్ లెవెల్స్ |
| Meet Centres | మీట్ సెంటర్స్ |
| **.... Namaskarams Master** | ....నమస్కారమ్స్ మాస్టర్ |

# ఉపోద్ఘాతము

మంత్రము లనగా శక్తివంతమైన శబ్దముల కూర్పు. మంత్రమున అర్థముకన్న శబ్దమునకే ప్రాధాన్యము మెండు. శబ్దమును నియమము ప్రకారము ఉచ్చరించినచో, అందలి శక్తి ఆవిర్భవించి, ఉచ్చరించు వానిని రక్షించుట, దారి చూపుట, మరియు మనో వికాసము కలిగించుట జరుగును. అనాదిగా భారతీయ సంస్కృతి యందు మంత్రముల కత్యంత ప్రాధాన్యము కలదు. సృష్టివిధానమును పరిశోధించి, శబ్ద తరంగముల ప్రభావము నెఱింగి వానిని కూర్పు చేసి ప్రాచీన ఋషులు మంత్రములుగ నొసంగినారు.

అత్యంత శక్తివంతములైన మంత్రములు బీజాక్షరములు. వానితో ప్రధానముగా ముప్పదిఐదు శక్తివంతములైన మంత్రములను అందించినారు. తరువాత శ్రేణిలో శబ్దముల కూర్పులో బీజాక్షరముల నమర్చి మంత్రముల నమర్చినారు. ఆ తరువాత శ్రేణిలో భగవంతుని నామము రూపమున మంత్రముల నందించినారు. సాధకుని స్థితిని బట్టి మంత్రము నెరిగిన గురువు సాధకునకు ఒక మంత్రము నుపదేశించుట పరిపాటి. మాస్టరు C.V.V. నవీన యుగమున అట్టి మంత్రములను మరల యిచ్చినారు. మంత్రములు శబ్ద తరంగముల కూర్పులే గనుక వానికి భాషా పరిమితత్త్వము లేదు. మంత్రములు సంస్కృతభాషకే పరిమిత మని కొందరి యభిప్రాయము. దానికి కారణము సంస్కృత భాషయందు ఏర్పడిన మంత్రములు ప్రసిద్ధ

మగుటయే. ప్రాచీన కాలమున యిట్టి మంత్రములు హీబ్రూ, చీనీ, గ్రీకు, అరబ్బీ భాషలయందు గూడ యుండెడివి. అవి క్రమశః మరుగుపడినవి. భాష శబ్దము నుండి ఏర్పడినది గాని, భాషనుండి శబ్దము యేర్పడలేదు. శబ్దప్రాధాన్యము గల మంత్రములు ఏ భాషకు చెందినవి? యని పరిశీలించుట బుద్ధిమంతుల లక్షణము గాదు. సంప్రదాయమున సత్యము ఉండవచ్చు గాని, సంప్రదాయముచే సత్యము బంధింపబడదు. సత్యము సంప్రదాయము నతిక్రమించి యుండును. ఇట్టి సంప్రదాయము వలన కలిగెడి పరిమితత్వము నుండి సాధకుని మేల్కొలుపుటకు మహాత్ములు కొన్ని చమత్కారములు చూపుదురు.

మాస్టర్ C.V.V. గారు ఈ సూత్రము నాధారముగా తనదైన శైలిలో, సాధకుల నుద్దేశించి కొన్ని మంత్రముల నొసంగినారు. అందు యిటుపై వివరింపబడు 16 మంత్రములు దివ్యశరీర నిర్మాణమునకు ఉపయోగపడునని, పిట్యూటరీ గ్రంథిని ప్రచోదనము చేయునని తెలిపి వానిని యుచ్చరించు విధానమును గూడ తెలిపినారు.

ఈ మంత్రములను ప్రతి రాత్రి నిద్రపోవు సమయమున పఠించి 15 నిముషములు మౌనము పాటించుట ఒక నియమము. ధనిష్ఠ నక్షత్రమున చంద్రుడు సంచరించుచుండగ ప్రత్యేకశ్రద్ధ వహించి ధ్యానించుట రెండవ నియమము. మాస సంక్రమణము నందు స్మరించుట మూడవ నియమము. ఉత్తరాయణము, దక్షిణాయనము, విషువత్ పుణ్యదినముల యందు వీటిని స్మరించుట నాలుగవ నియమము.

మంత్రమునకు అర్థము ప్రధానము కానప్పటికి మనస్సు కొంత అవగాహనను కోరును. అందువలన పాశ్చాత్య సాధకుల కోరికపై మాస్టర్ E.K. గారు ఈ పదహారు మంత్రములకు వివరణమును ఆంగ్లమున నొసగినారు. ప్రస్తుతము భారతీయ సోదరులు వీటిని తెనుగున అర్థించుటవలన స్వేచ్ఛానువాదముగా ఈ షోడశ మంత్రములకు వివరణము "నావాణి" మాసపత్రికలో "మర్మమంత్రములు" శీర్షిక ద్వారా అందించుట జరిగినది. ఇచ్చిన మంత్రములను యిచ్చినట్లే పఠించుట నియమము. కావున, మంత్రమునకు తెలుగు అనువాదము లేదు. మరియు అనువదించుటకు మంత్రమున భాషకు ప్రాధాన్యము లేదు గదా! కావున వివరణము మాత్రమే అందింపబడుచున్నది.

మాస్టరు C.V.V. గారొసంగిన మంత్రములు స్పష్టా స్పష్టములు. అందువలన వీటిని "మిస్టిక్ మంత్రమ్స్" అనిరి. అనగా గూఢమైనవి, మర్మముతో కూడినవి యని యర్థము. అందువలన ఈ పదహారు మంత్రములు "మర్మమంత్రములు."

- కంభంపాటి పార్వతీకుమార్

# "DIP DEEP"
# డిప్ - డీప్

ఈ మంత్రము లోలోతులకు మునుగుమని మనసునకు సూచించును. బహిర్గతమైన మనస్సు ఇంద్రియముల ద్వారా ఇంద్రి యార్థములందు పరువెత్తుచుండును. దానిని అంతర్ముఖము చేసినచో భావమయ మగును. భావమునకు పుట్టుక స్థానము - తెలివి. అనగా చైతన్యము. భావము చైతన్యము నందు మునిగినచో తాను చైతన్య మని తెలియును. ఈ తెలియుట కూడ తెలియువాని ఆధారముగ చేసుకొని వెలుగుచున్నది. అందులోనికి ప్రవేశించినచో తెలివి, తెలియుట, తెలుసుకొను వానియందు లయ మగును. అచట తా నుండుట తప్ప తా నున్నానను తెలివి కూడ నుండదు. ఇది ప్రతి జీవియొక్క నిజస్థితి.

ఈ స్థితి నుండి తాను తెలివిగను, ఆలోచనలుగను, కోరికలుగను వ్యక్తమగుచున్నాడు. ఈ స్థితిని జీవి నిదురయందు అనుభవించుచునే యున్నాడు. కాని అనుభవించు చున్నట్లు తెలియుట యుండదు. తన మనస్సు భావములు లేక తా నుండుట తురీయ స్థితిగ, యోగస్థితిగ పెద్దలు చెప్పుదురు. ఇది తనలోనికి తాను చొచ్చుకొని పోవు అభ్యాసమున మాత్రమే తెలియును. తురీయస్థితి పూర్ణ చైతన్య స్థితిగ, తాను పూర్ణ చైతన్యవంతుడుగ తెలియుట ఈ మంత్రము యొక్క నిర్దేశము.

"మునుగుము - లోతుగ మునుగుము" అని చెప్పుటలో బాహ్య ఆవరణల యందు వున్న ప్రజ్ఞను కేంద్రమునకు కొనిరమ్మని నట్లుగ ఈ మంత్రము సూచించు చున్నది. ఈ సూచన ప్రకారము అభ్యాసము కొనసాగించినచో ప్రతి వ్యక్తికిని తన భావమయ ప్రళయ మేర్పడును. అనగా తన భావమయ సృష్టి తనలోనికి లయమగును. తన సృష్టికర్తకు తానే మూలమని తెలియగలదు. ఈ విధమైన తిరోధానము అభ్యసించుట వలన తన సృష్టికి, తన తెలివియే సృష్టికర్తయని, తన సృష్టి నుండి తాను ముక్తు డగుటకు వలసిన ముక్తి లభించును. ముముక్షుత్వమునకు అంతర్ముఖమగు ద్వారములను తెరచుటయే ఈ మంత్రము యొక్క పరమావధి.

# "AXIS ARRANGED HOURS"

# యాక్సిస్ ఎరేంజ్డ్ అవర్స్

మానవ చైతన్యము ఒక వెలుగు రవ్వవలె బిందు రూపముగ వెలుగుతో నిండియున్నది. ఈ వెలుగు బిందువు ఆకసమున గాక మనసున నుండునది. మనసుకు ఆధారముగ నున్న ఈ చైతన్య బిందువే మానవుడు. మనసు లేనపుడు కూడ ఈ బిందు వుండును. అనగా నిద్రయందు, మరణానంతరము కూడ వుండును. సామాన్యు లకు ఇది మనసుగా పనిచేయు చుండును. దేహమున మన మే భాగమును ప్రత్యేకముగ గుర్తింతుమో, ఈ బిందువా భాగమున అపుడు అచ్చట నుండును. మనిషి సర్వ సామాన్యముగ మనసు యందుండుటచే ఈ బిందువు మనసుననే ఎక్కువ స్థితి చెంది యుండును. ఏదో ఒక ప్రాంతమున ఇట్లు నిలబడియున్న ఈ బిందువును గురువు యందుంచినచో అనగా స్మరణ మాత్రమున మనసును గురువునకు సమర్పించినచో ప్రాంతీయ స్థితుల యందుండక ఈ బిందువు స్వస్థానము చేరును. ఈ చైతన్య బిందువు నకు హృదయమే స్వస్థానము (హృత్+అయం = హృదయమనగా నేనిక్కడ వున్నానని అర్థము). నేనను దైవ ప్రజ్ఞ, నేనను మానవ ప్రజ్ఞ ఏకీభవించు స్థానము హృదయము.

ధ్యానమున ఈ స్వస్థానమున చైతన్య బిందువు ఎక్కువగ నుండుట జరుగును. మనసు నుండి ఈవలకు వచ్చిన ఈ బిందువును

మరల మరల హృదయమున గ్రహించుట వలన ఈ బిందువు ఒక నిలువైన సరళరేఖగ ఏర్పడును. ఈ సరళరేఖ తేజోవంతమైన వెలుగు రేఖగ, సాధకుని ధ్యానమును బట్టి ఏర్పడు చుండును. ధ్యానము నందలి శ్రద్ధాభక్తులు, నిరంతర అభ్యాసము తోడ్పడినచో ఈ వెలుగు రేఖ ప్రస్ఫుటముగ గోచరించును. రేఖ ప్రకాశవంత మగుచున్నకొలది బాహ్య ప్రపంచము అందులోనికి అదృశ్య మగుచుండును. అనగా బహిర్ముఖమైన మనస్సు అంతర్ముఖ మగుచున్నదని అర్థము. బాహ్య ప్రజ్ఞ అంతర్ ప్రజ్ఞతో ఈ విధముగ యోగము చెందును. ఈ నిలువైన సరళరేఖనే 'ధ్రువము' అందురు.

ఈ ధ్రువము ఏర్పడినప్పుడు బాహ్యప్రపంచము లేదు. దాని భ్రమణమును లేదు. నిజమునకు ఈ ధ్రువము ఆధారముగనే బాహ్య ప్రపంచమొక గోళముగ ఏర్పడుచున్నది. ఇపుడు చైతన్యము ధ్రువ రూపమున నుండుటచే బాహ్యము లేదు, దాని వర్తనము లేదు. కావున కాలము కూడ లేదు. భ్రమణ మున్నప్పుడే కాలముండును. భ్రమణము బాహ్య ప్రపంచ లక్షణము. మానవ చైతన్య బిందువు అంతరమై ధ్రువమగుట వలన కాలము, ప్రపంచము యొక్క ప్రభావము తనపై తగ్గును. ఈ స్థితినే ధ్రువ మేర్పడిన శుభ సమయ మని తెలుపుటకు మాస్టరుగారు "*Axis Arranged Hours*" అనిరి.

# "HIGHER BRIDGE BEGINNING"
# హయ్యర్ బ్రిడ్జ్ బిగినింగ్

మానవ శరీరమునకు సూక్ష్మము నుండి స్థూలము వరకు పొరలు గలవు. ఇందు సూక్ష్మమున అంతర్హితుడుగను, స్థూలమున బహిర్ముఖుడుగను మానవుడు జీవించు చుండెను. ఇందొక్కొక్క పొర ప్రత్యేకమైన పదార్థముతో నిర్మాణము చేయబడి యున్నది. పొర యొక్క సూక్ష్మతను బట్టి మానవ చైతన్యము ప్రకాశించు చుండును. ఈ ఏడు పొరలయందు ఏడు స్థితులలో మానవుడే జీవించు చుండును. ఇవి స్థూలముగ అన్నమయము, ప్రాణమయము, మనోమయము, విజ్ఞానమయము, ఆనందమయము, ఆత్మమయము, పరమాత్మ మయముగ నిర్వచింపబడినవి.

ఇవి మానవుని యందెట్లున్నవో సృష్టియందు కూడ అట్లే కలవు. నిజమునకు సృష్టియందున్న ఏడులోకములే మానవునియందు కూడ కలవు. ఈ విధముగ సృష్టికిని, మానవునకును అనుబంధ మున్నది. ఈ ఏడు లోకములు ఒకదానితో ఒకటి కలియు స్థానమున కొన్ని కేంద్రము లున్నవి. ఈ కేంద్రములు స్థూల లోకములు సూక్ష్మము లగుటకు, సూక్ష్మ లోకములు స్థూలము లగుటకు రసాయనిక కేంద్రములుగ సృష్టియందును, మానవుని యందును కూడ లోకములు ఏర్పడుటకు, ఆరు కేంద్రము లేర్పడును. ఇవియే మానవుని యందలి షట్చక్రములు. ఇవి వరుసగా ఆజ్ఞ, విశుద్ధి, అనాహతము, మణి

పూరకము, స్వాధిష్ఠానము, మూలాధారము అను కేంద్రములు లేక స్థితిభేదము కలిగించు చక్రములు.

ఇందు పై మూడు చక్రముల యందును సూక్ష్మత్వ ముండును. ఇవి వరుసగా వాయువు, ఆకాశము, ఆకాశమునకు మూలము అయిన తత్త్వము వుండును. క్రింది మూడు చక్రముల యందు నీరు, అగ్ని, పదార్థము తయారగు చుండును. సృష్టి సూక్ష్మము నుండి స్థూలమునకు దిగివచ్చినదే కావున, సూక్ష్మము నుండి స్థూలము వరకు సూక్ష్మత్వము వ్యాపించియే యుండును. సూక్ష్మము నుండి స్థూలము నకు భావములు, కామములు వ్యక్తమై సూక్ష్మ చైతన్య స్థితు లాధార ముగ స్థూల శరీరము కదిలింపబడు చుండును. ఈ మొత్తము లోకములను కదిలించునది అంతర్ముఖముగ నున్న చైతన్యమే. అది మానవుని యందు మానవ చైతన్యముగ నిర్వచింపబడు చున్నది.

ముందు వివరింపబడిన ఏ చైతన్యమైతే ఏడు లోకములను నిర్వర్తించు చున్నదో అదే మానవునియందు ఎక్కువగ బుద్ధిలోకము నుండి మనోలోకమును నిర్వర్తించు చుండును. మనోలోకమున నుండు ఆజ్ఞ లాధారముగ ప్రాణమయ, అన్నమయ లోకములు నిర్వర్తింపబడు చున్నవి. అనగా బుద్ధి ఆధారముగ మనస్సు నుండి మానవుడు కార్యములను నిర్వర్తించు చుండును. కాని సామాన్య మానవునకు బుద్ధి కన్న మనస్సే సమస్తము నిర్వర్తించుట వలన సూక్ష్మలోకములతో అనగా వెలుగు లోకములతో సంబంధ ముండదు. (ఇట్లు సంబంధము తెగుటవలన అంతర్లోకములకు, బహిర్లోకము లకు మధ్యన వుండు బుద్ధి అను వంతెన అదృశ్య మగును).

ఈ స్థితిలో మానవుడు యోగభ్రష్టత్వము చెందును. యోగస్థితి, మానవుని సహజస్థితి. బుద్ధిని కోల్పోవుటవలన పైలోకములతో బంధము తెగి యోగము నశించును. అపుడు మానవుని అజ్ఞాన మావరించును. కేవలము బహిర్ముఖుడై జీవించును. అది కారణముగ పదార్థముచే బంధింపబడును.

పదార్థముచే బంధింపబడిన మనస్సు సమన్వయమును కోల్పోయి, ద్వంద్వమున పడి ఇష్టాయిష్టములను, రాగద్వేషములను, కామక్రోధములను, లోభమోహములను, మదమాత్సర్యములను, ఈర్ష్యాసూయలను పొందుచుండును. వీని సంబంధిత భావములు, సంఘటనలే మనస్సున నిండి జ్ఞాపకముల నేర్పరచు చుండును. అందు భయము, భీతి, ఆత్రుత, ఆవేశము, ఆందోళన అను విష బీజములు పుట్టి మానవుని పశువుగ మార్చును. ఈ విధముగ యోగమునుండి నష్టము చెందిన మానవుడు క్రమశః మానవత్వ మును కూడ కోల్పోవును.

మరల యోగస్థితి నొందుటకు మానవుడు బుద్ధి యను వంతెనను నిర్మాణము చేసుకొనవలెను. నియమిత కార్యముల నొనరించుచు జీవించుట దీనికి మొదటి మెట్టు. పవిత్ర గ్రంథ పఠనము రెండవ మెట్టు. మహాపురుష సాంగత్యము మూడవ మెట్టు. నిరంతర దైవప్రార్థన నాలుగవ మెట్టు. ఈ నాలుగు విధములైన కార్యక్రమము లను క్రమశిక్షణతో పొందినవానికి మరల బుద్ధి వికాసము కలుగును.

వికాసము వలన సత్కార్యముల నాచరించు బుద్ధి కలుగును. అనగా మరల బుద్ధిలోకములనుండి మనస్సు ఆజ్ఞలను స్వీకరించు

చుండును. ఇది కారణముగ బుద్ధికిని, మనస్సునకు మరల సంధాన మేర్పడును. ఈ సంధానము క్రమశః ఒక పటిష్ఠమైన వంతెనగ ఏర్పడును. అపుడు మానవుని యందు పై లోకములకు క్రింది లోకములకు వంతెన నిర్మాణ మగును. ఈ వంతెన భ్రూమధ్యమున నున్న గ్రంథి నుండి పిట్యూటరీ గ్రంథి వరకు ఏర్పడును. మనస్సు బుద్ధియందు ఇముడుచున్న కొద్దీ వంతెన పటిష్ఠ మగుచుండును. ఈ వంతెన నిర్మాణమునకు స్రవించు ద్రవము కాంతివంతముగ నుండును.

కామవాంఛ కలిగినపుడు వీర్యము ఏ విధముగ స్రవించునో దైవమును (అనగా వెలుగును) వాంఛించినపుడు పై చెప్పబడిన ద్రవము స్రవించును. విశ్వాత్మ చైతన్యమును, తాను నమ్మిన గురు స్మరణచే ఆహ్వానించుట వలన ఈ ప్రక్రియ ఆరంభమగును. మనసున సిద్ధుడగు సద్గురువు రూపమును స్మరణ చేయుటవలన, ఆత డందించిన ఉపదేశమును పఠించుట వలన ఈ ప్రక్రియకు సంబం ధించిన పని ప్రారంభమగును. గురువు ఆశీర్వచనముగ శిష్యుని మనస్సునందు ఈ ప్రక్రియ మొదలగును.

మాస్టరుగారు అందించిన మార్గమున మనస్సు మాస్టరుగారి యందుగాని, మంత్రము నందుగాని లగ్నము చేయుట పనికిరాదు. మాస్టరుగారి రూపము, నామము, మంత్రము ప్రక్రియ నారంభిం చుటకు వలసిన స్విచ్‌గా భావన చేయవలెను. పై మూడింటిని మనస్ఫూర్తిగా స్మరణ చేసిన తరువాత సాధకునకు అంతర్ముఖముగ జరుగుచున్న కదలికలను గమనించుటయే కర్తవ్యము. ఒకటికి

పదిసార్లు మంత్రమును చేయుట, రూపమును గుర్తునకు తెచ్చు కొనుట మనోయత్నముగాన మనస్సు బుద్ధినందు కరుగక తానుగ, పటిష్ఠ మగుచుండును. అందువలన మనో ప్రయత్నమునకు విశ్రాంతి నిచ్చినచో చైతన్య బిందువు మనస్సు యను కక్ష్యనుండి బుద్ధిలోనికి మరలుటకు అవకాశ మున్నది. మనస్సు పుట్టు చోటును లేక భావములు పుట్టు చోటును గమనించుటయే ఉపాయము.

అభ్యాస వశమున మనస్సు బహిర్ముఖముగ పరువెత్తుచున్నను గమనించుట అను క్రొత్త అభ్యాసము వలన భావ పరంపరలను గమనించు చైతన్యముగ సాధకుడు ఏర్పడగలడు. అతడు గమనించు వానిగ నున్నప్పుడు భావములుగ మారును. భావములు క్రమముగ అరికట్టబడును. తాను భావములను అరికట్టుటగా కాక, తాను గమనించు వానిగ ఒక నూతన స్థితి యందున్నప్పుడు భావములు అరికట్టబడుట జరుగును. ఇది జరుగు ప్రయత్నమున సిద్ధుడగు సద్గురువు యొక్క సాన్నిధ్యము తోడగుట వలన ప్రయత్నము త్వరిత గతిని సిద్ధించును. అందువలననే ఆరంభమున సద్గురువునకు మనసు అర్పణము చేయుట సూచింపబడినది.

ఇట్లు పై చెప్పబడిన అభ్యాసము వలన మానవ చైతన్య బిందువు క్రమశః బుద్ధియందు స్థిరపడుటయు, బుద్ధి నుండి ఆజ్ఞలను మనస్సునకు నిర్దేశించుటయుగా పరిణామము చెందును. ఊర్ధ్వ లోకములకు, అధోలోకములకు వంతెన నిర్మాణము జరుగవలెను. దీనినే మాస్టరు సి.వి.వి.గారు "*హయ్యర్ బ్రిడ్జ్ బిగినింగ్*" అనిరి.

# "TRUTH LEVELS"

# ట్రూత్ లెవెల్స్

ప్రపంచము ఒకటియే అయినను అందరి కొకటిగ గోచరించదు. సంస్కారమును బట్టి వివిధములుగ గోచరించును. ఉదాహరణకు శ్రీరాముడు, శ్రీకృష్ణుడు కొందరికి దైవముగ గోచరించును. కొందరికి మిత్రునిగ గోచరించును. కొందరికి శత్రువుగ గోచరించును. కొందరికి సర్వ సమర్థులుగ గోచరించును. కొందరికి చేతకాని వారిగ గోచరించును. ఇట్లు చూచువాని స్థితిని బట్టి గోచరించుట యుండునుగాని, ఎల్లవేళలను నిజమున కున్నది సత్య మొక్కటియే. భౌతికమున జీవించు మానవునకు సృష్టి అంతయు కేవలము భౌతికమే. కామమున జీవించువానికి ప్రపంచము కామపూరితముగ గోచరించును. మరికొందరికి ప్రపంచము మంచి చెడు అను అభిప్రాయములుగ వర్గీకరింపబడి గోచరించును. ఇంకొందరికి విజ్ఞానమయముగ గోచరించును. కొద్దిమందికి మాత్రము ఆనందమయముగను, ప్రేమమయముగను గోచరించును. ఏ ఒకరికో సమస్తము వెలుగుగను, వెలుగుయొక్క వివిధ స్థితులుగను గోచరించును. ఇట్లు సత్య మొక్కటియే అయినను, సంస్కారమును బట్టి వివిధములుగ గోచరించుట యుండును. బుద్ధియందు స్థిరపడిన చైతన్యము వీనిని గుర్తించుటచే మంచి, చెడుల వాగ్యుద్ధమున తగులుకొనక అన్ని దృక్పథములను సత్యముయొక్క స్థితులుగ సమన్వయించుకొన

గలదు. ఏ స్థితినీ నిర్లక్ష్యము, నిరాదరణము, నిరాకరణము చేయక, అన్ని స్థితులను గ్రహించి తగు రీతిని ప్రతిస్పందించుట యుండును. అట్టివాడే సత్యమును, సత్య స్థితులను ఎరిగినవాడు. 'ట్రూత్ లెవెల్స్' అని చెప్పుటలో మాస్టరుగారు పై విషయములను వివరించుచున్నారు.

# "NIL NONE NAUGHT LEVELS"

# నిల్ నన్ నాట్ లెవెల్స్

Nil అనగా శూన్యము. అనగా సంకల్ప ముద్భవించని స్థితి. None అనగా ఏ ఒకటీ వ్యక్తమవని స్థితి. Naught అనగా No thought అని. అనగా అభావస్థితి. శూన్యము, అవ్యక్తము, అభావము అను స్థితిని ఈ మంత్రము ద్వారా మాస్టరుగారు సూచించుచున్నారు.

మనస్సు నేను అను ప్రజ్ఞయందు లయమైన సందర్భమున ఈ స్థితిని మానవుడు అనుభూతి చెందును. మానవునికి బుద్ధి లోకమున రెండు స్థితు లుండును. ఒకటి ఊర్ధ్వ భాగము, రెండవది అధోభాగము. బుద్ధియొక్క అధోభాగము నుండి మనస్సు వ్యక్త మగుచుండును. అనగా భావ పరంపర లేర్పడుచుండును. బుద్ధి యొక్క ఊర్ధ్వ భాగము నిశ్చలము, తేజోవంతమునైన ఆకాశము వలె నుండును. అచట భావము లుండవు. కేవలము తానుండును. అదియొక నిశ్చలము, అనంతమునైన వెలుగు సరస్సు వలె నుండును. అచటనుండి తరంగముల వలె బుద్ధి యొక్క అధో భాగము చరించుచుండగా దాని నుండి తుంపరల వలె భావము లుద్భవించు చుండును. నేనున్నా నను భావము ఆధారముగ వెలుగు, వెలుగు ఆధారముగ వెలుగు తరంగములు, అవి ఆధారముగ సత్సం కల్పములు, అచట నుండి వికారముగ ఇతర సంకల్పములు కలుగు చుండును. తననుండి వచ్చు సంకల్పములు, బయట ప్రపంచము నుండి తన కేర్పడు సంకల్పములు, ఒకదానితో నొకటి జమిలిగా

పెనవేసుకొని సందిగ్ధమైన మనస్సుగ సామాన్య మానవుడు జీవించు చుండును. వీనికి తోడుగా మితిమీరిన కోరికలు, అరిషడ్వర్గములు జోడై మానవుని మనస్సు విషమస్థితికి చేరుకొనును. బుద్ధియను వెలుగు అదృశ్యమై చీకటియందు చిందులాడు చుండును. పరిష్కారము లేని సమస్యలను చిత్రించుకొని, తనను తాను గట్టిగ బంధించుకొనును.

పై చెప్పిన బంధస్థితి నుండి బయల్పడుటయే ముక్తిమార్గము. అందులకు నిష్కామకర్మ మొదటి మెట్టు. తా నేపని చేయుచున్నను, అందు తను పొందున దేమి? అను కక్కుర్తిలేక, కర్తవ్యము నిర్లిప్తముగ ఆచరించుట నిష్కామ కర్మయోగము. కారణముతో కూడిన కార్యము కార్యకారణ సంబంధముగా మనిషిని పెనవేయు చుండును. కర్తవ్యముతో కూడిన కర్మ అట్టి బంధము నుండి విమోచనము కల్గించును. బంధ విమోచనమునకు ఇది ఒక్కటియే సూటియైన మార్గము, ముఖ ద్వారము. పనిచేయుట కేదియో ఒక కారణ ముండవలెను కదా! అని యనుకొనుట అజ్ఞానము. కారణ ముండ నక్కర లేదు. కర్తవ్య ముండవలెను. కర్తవ్యములు లేని కారణ పూరితమైన కార్యము బంధము నేర్పరచునని ఎరుగవలెను. ఇట్లు కార్యకారణ సంబంధముగా మానవుడు తీరుబడిలేక జన్మ లెత్తు చుండును.

తాను ప్రజ్ఞావంతుడనని, తన చుట్టును ఏర్పడిన జీవులు కూడ అట్లే ప్రజ్ఞావంతులని గుర్తించి అందరితో సోదర భావమున మెలగుట రెండవ మెట్టు. ఈ విధముగ అన్నిటియందు గల చేతనా స్వరూపమును

అనుస్యూతము గుర్తించుచు జీవించుటచే తన యందలి చేతన లేక ప్రజ్ఞ మేల్కాంచి, వృద్ధి పొందుచుండును. ఇట్టి వృద్ధి క్రమశః వ్యాప్తిచెంది, తానే సర్వజీవరాశుల యందు ఉన్నానని, సర్వజీవరాశుల యందు తా నున్నానని తెలియుటగా ఏర్పడును.

తానుండుట యనగా సర్వమే తానుగా నుండుట. అనంత అనగా అనంత ప్రజ్ఞయే వ్యక్తిగత ప్రజ్ఞగా ఉన్నదని తెలియుట మూడవ మెట్టు. అపుడు కేవలము అనంత చేతనమే ఉండును గాని, తాను, ఇతరులు ఉండరు. ఈ స్థితినే శూన్యస్థితి యని, ఏ ఒకటి లేని స్థితి యని, అభావ స్థితియని మాస్టర్ C.V.V. గారు మంత్ర రూపమున తెలిపినారు.

# "NORMAL TEMPERAMENT"

# నార్మల్ టెంపరమెంట్

మానవుని స్వభావము వివిధములుగ నుండును. రక రకముల వికారములు చెంది యుండును. దైవీ స్పర్శ కలిగిన మానవ స్వభావము సహజముగ నుండును. ప్రకృతితో మానవుడు ప్రతిస్పందించు చున్నప్పుడు మానవునకు వివిధములైన అనుభవ ములు కలిగి ప్రతి ఒక్కరికిని వారిదైన ప్రత్యేక స్వభావము లేర్పడు చుండును. ఈ ప్రత్యేక స్వభావము మానవుని సహజ స్వభావము నుండి వేరుగ ఏర్పడి సహజ స్వభావమును కప్పివేయును.

సత్వస్థితి మానవుని సహజస్థితి. రజోగుణము, తమోగుణము సత్వమునకు లోబడి నిర్వర్తింపబడుట వలన మానవుని పరిపూర్ణ తత్త్వమును తెలియజేయును. రజోగుణము, తమోగుణము అధిష్ఠించి నపుడు అతడు తన సహజత్వమును కోల్పోవును. అట్టి స్థితిలో మానవుడు మానవత్వమును ప్రదర్శింపడు. మాస్టరుగారి యోగ మార్గమున 'C.V.V.' అను శబ్దము నుచ్చరించుటచే వరుణ గ్రహము నుండి ప్రజ్ఞా ప్రసారము జరిగి త్వరితగతిని తమోగుణమును, రజో గుణమును శమనము చెందగలవు. సాధకుని స్వభావమున ఒక అలజడిని రేపి, ఆ అలజడి కారణముగ అసహజ స్వభావము మథింప బడి, సహజ స్వభావము ప్రస్ఫుటము కాగలదు. ఇదియే మాస్టరు C.V.V. యోగ మార్గమున గల నూతనత్వము. వరుణ గ్రహమునకు

సంబంధించిన ప్రజ్ఞను సాధకుని హృదయము నుండి మాస్టరుగారు ప్రవేశపెట్టుదురు. అపుడు ఆ ప్రజ్ఞా తరంగములు హృదయమునుండి వెలువడి స్వభావమున వలసిన మార్పులను నిర్వర్తించును. సాధకుడు త్వరితగతిని తన సహజ స్వభావమును పొందగలడు.

సహజ స్వభావము పొందిన సాధకుని యందు సత్వము ప్రధానముగ నుండును. సత్వగుణము వేదికగ, గుణాతీత తత్త్వము అతనినుండి ప్రకాశింపగలదు. మాస్టరుగారికి వాహికగ నిలచుట యనగ ఇదియే. దీనినే మాస్టరుగారు *"Normal Temperament"* అని సంకేతించిరి.

# "TIME EXPAND"
# టైమ్ ఎక్స్‌పేండ్

కాలము యొక్క మానము (కొలత) లోకమును బట్టి మారుచుండును. మనస్సు, ఇంద్రియములు చేయు కొలమానము బుద్ధి, ఆనందమయ లోకములలో అట్లుండదు. క్రియల వరుస క్రమమునే మనస్సు కాలముగ పరిగణించు చుండును. రెండు సన్నివేశముల మధ్యకాలమును కొలచుచు మనస్సు కాలమును అవగాహన చేసుకొనుచుండును. ఉదాహరణకు తినుటకు ముందు, తినిన తరువాత గడియారము చూసుకొని ఇన్ని నిమిషములైనదని లెక్కించుకొనుచుండును.

బుద్ధి, ఆనందమయ లోకములలో ఈ లెక్కలుండవు. ఆత్మ లోకమున కాలమే వుండదు. అపుడు తానే వుండును గనుక, మరియొకటి యుండదు గనుక కాలము కూడ లేదు. ఆత్మ లోకమున తా నుండుట యుండును గాని, తా నున్నానన్న భావ ముండదు. అది మనస్సు కరిగిన స్థితి. సంగీతమునందు కూడ మనస్సు కరిగినపుడు నిమిషములు, గంటలు తెలియవు. అనుభూతి యందున్నప్పుడు కూడ మానవునకు కాలము లేదు. అనుభూతి ముందు, తరువాత కాలము పరిగణింపబడును కాని, అనుభూతి యందు కాలము పరిగణింపబడదు. అపుడు తాను అనుభూతిగ మాత్రమే యుండును.

ప్రస్తుతమున పరిపూర్ణముగ జీవించువానికి ఈ విధముగ కాలము పరిమితి నేర్పరచదు. నిత్యానుభూతి యందు జీవించువానిని

కాలచక్రము పరిమితము చేయదు. అట్టి వానికి కాలము పరిధి పెరుగుచుండును. దీనినే మాస్టరు C.V.V.గారు 'టైమ్ ఎక్స్‌పేండ్' అనిరి. ఈ స్థితిని చేరినవారు వారములో నెలసరి అనుభూతి, నెలలో సంవత్సరము అనుభూతి, ఒక జన్మలో పది జన్మల అనుభూతి పొందుదురు. ఇది మాస్టరుగారి యోగమున విచిత్రానుభూతి.

# "ELECTRIC HINT"
# ఎలక్ట్రిక్ హింట్

మనస్సు కరిగి, కాలము వ్యవధి పెరిగి చైతన్యమే వర్తించు సమయమున ముందుగా నూహించెడు ప్రణాళికలు కాని, ఆలోచనల నుండి వెలువడు కార్యములు కాని వుండవు. ఆలోచించుట, చేయుట ఏక కాలమున చైతన్యము నుండి విద్యుత్ మెరపువలె దర్శనము వ్యక్తమగును. ఈ స్థితిలో ముందు తెలుసుకొని తరువాత చేయుట యుండదు. తెలుసుకొనుటయే చేయుటగా జరిగిపోవు చుండును. సామాన్యులకు సంకల్పము కలుగుట, అది భావముగ రూపు దిద్దు కొనుట, ఆ భావము నాధారముగ మాట్లాడుట మరియు పనిచేయుట నుండును.

మాస్టరు చైతన్యముచే స్పృశింపబడిన వాడు ఇన్ని స్థితులద్వారా అవరోహణము చేయుట కాక, ఏక కాలమున మెరపువలె సమస్త మును వ్యక్తము చేయును. దీనికి కారణము మనస్సు కరుగుట మరియు కాల బంధనము లేకుండుట. ఇట్టి స్థితిలో స్ఫూర్తి సరాసరి కార్యరూపమున నుండును. సాధకుని ప్రవర్తన ఒక మెరపువలె నుండును. నిజమునకు సాధకుడు వ్యక్తిగతముగ నుండక, ఈశ్వర చైతన్యమై ప్రవర్తించుచుండును. దాని నూహించుటకు వీలుపడదు. అకస్మాత్తుగా మెరపువలె అవతరించును.

ముందు తెలిపిన విధముగ ఈశ్వర చైతన్యము సాధకుని స్పృశించినపుడు, సాధకుని జీవితమున తనదైన ప్రణాళిక క్రమశః అదృశ్యమగును. మాస్టరు (ఈశ్వర) చైతన్యము ప్రణాళికయై నిర్వర్తింపబడును. సాధకుడు ఉపన్యసించునపుడు తనకు ముందు తెలియని విషయములు కూడ తన నుండి వెల్లువై ప్రవహించును. తన ఉపన్యాసమును ఇతరులతోపాటు తనుకూడ వినుచుండును. అటులనే అతని చేతలు కూడ. మాట, చేత, సాధకుడు వాహికగ వ్యక్తమగుచుండును. అపుడే అతనికి కూడ తెలియును. ముందు తెలియవు. ముందు వెనుక తెలియక మనస్సున స్థితి, భూతము, భవిష్యత్తుగ కాలమున్న స్థితి. మనస్సు, కాలము చైతన్యమునందు కరిగి యుండుటచే సమస్తము అప్రయత్నముగ సాగుచుండును.

ఇదియొక అపూర్వవైభవము. దీని విధానము నిత్య నూతనము. ఊహ కతీతము. ఇందు సూక్ష్మలోకముల నుండి స్థూల లోకములకు ప్రవహించు ప్రజ్ఞకు కాలక్రమమను పరిమితి యుండదు. తెలియుట, జరుగుట ఏకకాలమున నుండును. స్విచ్ వేయగనే బల్బు వెలుగుచున్నది కాని, స్విచ్ నుండి బల్బు వరకు ప్రవహించు విద్యుత్తు సమయమును కోరుటలేదు కదా! ఇచట కాలము - దూరము అను నిష్పత్తి యుండదు.

సాధకునకు ఈ విద్యుత్ మెరపు అనుభూతి నిర్వర్తింపబడు ప్రారంభ దశలలో తాను, తన నుండి జరిగిన దానికి నిశ్చేష్టుడగుట, ఆశ్చర్యపడుట యుండును. దీనికి కారణము మాస్టరు చైతన్యము

నిర్వర్తింపబడు చున్నప్పుడు తానందు కరిగి యుండుటయే. ఆ ఘటనకి ముందు, వెనుక, తాను తన మనస్సుగ వుండును. ఘటన జరుగుచున్నప్పుడు తన మనస్సు కరిగిన స్థితి యందుండును. జరిగినది ఎట్లు జరిగినదో వివరించుటకు వ్యర్థ ప్రయత్నములు చేయుచుండును. జరుగుచున్నప్పుడు గమనించుటకు మనస్సు లేదు కదా! ఘటన తరువాత ఏర్పడు మనస్సు ఘటనా విధానము నెట్లు వివరించగలదు? అవగాహన, దాని వివరణము మనస్సునకు సంబంధించినవి. అనుభూతి నేనను ప్రజ్ఞకు సంబంధించినది. మనస్సు పొరలు ఆవరించిన ప్రజ్ఞ దాని కతీతమైన విధానమును అవగాహన చేసుకొననూ లేదు, వివరింపనూ లేదు. మాస్టరుగారి ప్రార్థన జరుగు చున్న సమయములలో ఈ స్థితి తరచూ ఏర్పడును. ప్రార్థన జరిగిన తరువాత దానిని గూర్చి మనస్సు చేయు పునరాలోచన అతి స్వల్పముగ దానిని గ్రహించగలదు.

ఒక విద్యుత్ తీగల సముదాయమున విద్యుత్ క్షణకాలమున నెట్లు వ్యాపించునో మాస్టరుగారి స్మరణమున, సాధకుని సమస్త నాడీ మండలముల నుండి చైతన్యము క్షణ కాలమున వ్యాపనము చెంది ఆక్రమించును. విద్యుత్ పరికరము పనిచేయుటను బట్టి అందు విద్యుత్ వున్నదని ఎట్లు తెలియుచున్నదో సాధకునియొక్క పని తనమునుబట్టి మాస్టరు చైతన్యము సాధకుని నిండియున్నదని తెలియును. ఎవ్వరికిని విద్యుత్ ఎట్లుండునో తెలియదు కదా! అట్లే మాస్టరు చైతన్యమునూ. అనుభవించువాని కవి అవగతము. ఈ

అనుభూతియే విద్యుత్ అనుభూతి, విద్యుత్ స్పర్శ అని మాస్టరుగారు అభివర్ణించినారు.

ఇదియొక అత్యద్భుతమైన ఆకస్మిక పరిణామము. కుంభ యుగము చైతన్యముయొక్క ప్రత్యేకత. త్వరితగతిని జీవుల నుద్ధరించు నూతన ప్రణాళిక. మానవజాతికి మాస్టరు C.V.V. గారు అందించిన దివ్యమైన కానుక! దీనినే మాస్టరుగారు నూతన యోగ మనిరి. ఇందు కాలముయొక్క వేగము పరిగణింపబడదు. ఈ మర్మ మంత్రమును బాగుగా అధ్యయనము చేయవలెను.

# "ETHER WORKOUT"

# ఈథర్ వర్కౌట్

ప్రతి మానవుడు తనదైన జీవితమును తాను నిర్మించుకొనుచుండును. తన భావములు, తన స్వభావము, తనదైన తర్కము, నమ్మకము, మతము ఆధారముగ తన జీవితము నిర్మాణము చేసుకొనుచుండును. ఈ మొత్తము నాధారము చేసుకొని జీవించుచుండును. తనకు తాను సరిగా నున్నా ననుకొను చుండును. ఇతరులు తనవలె వుండకుండుట చూచి జాలి పడుచుండును. ఇట్లు కోటాను కోట్ల మానవులు తమదైన వివిధత్వము చెంది యున్నారు.

ఎవరి బుద్ధి వారిది. ఎవరి స్వభావము వారిది. ఇది కారణముగ తప్పు ఒప్పులను నిర్ణయించు చుందురు. బుద్ధి లోకములలోకి ఎదుగుచున్న కొలది మానవునకు పై భావముల పరమితత్త్వము క్రమశః తెలియుచుండును. ఎవరి స్వభావము ప్రకారము వారు ప్రవర్తించుచున్నారని తెలియుటచే వాదములు, తర్కములు, తప్పు ఒప్పుల నిర్ణయములు ప్రక్కకు నెట్టి తన యందలి తప్పు ఒప్పులను, పరిమితులను అవగాహన చేసుకొనుచు వానిని దాటుటకు ప్రయత్నము చేయును. స్వభావముచే బంధింప బడిన జీవనమునకు చరమ గీతము ఆరంభమగును.

వ్యక్తిగత స్వభావము ప్రజ్ఞకు లోబడునట్లు చేయు ప్రయత్నమే సాధన. ఈ సాధన జరుగుచున్న కొలది మనోభావముల పరిమి

తత్త్వము నుండి మానవుడు తన్ను తాను ఉద్ధరించుకొనుచుండును. బుద్ధిలోకములలోనికి ప్రవేశ మేర్పడును. అట్టి స్థితిలో వ్యక్తిగత శ్రేయస్సు కొఱకై పాటుపడక సంఘశ్రేయస్సుకై పాటుపడుట సహజముగ నేర్పడును. వ్యక్తిగత ప్రణాళిక జాతికి నిర్దేశింపబడిన ప్రణాళికలో నిమగ్నమగును.

జాతి శ్రేయస్సుకై నిర్దేశింపబడిన ప్రణాళికనే దివ్య ప్రణాళిక యందురు. ఇట్లు సాధకుడు దివ్య ప్రణాళికకు అంకిత మగు చుండును. వ్యక్తిగత ప్రజ్ఞ, భౌగోళిక ప్రజ్ఞకు లోబడి పనిచేయు చుండును. భౌగోళిక ప్రజ్ఞ సూర్యప్రజ్ఞతో ముడిపడి వుండుట వలన సూర్య భౌగోళిక ప్రజ్ఞలు, ఈ స్థితిలోని సాధకుని నుండి వ్యక్తమగు చుండును. అట్టి సందర్భమున సాధకుని శరీరము నందలి సప్త ధాతువులును పరిణామమునకు గురికాబడు చున్నవి. శరీరము నందలి అన్ని కోశములును ఒక రసాయనిక ప్రక్రియకు లోనగును. పునర్నిర్మాణమునకు శరీరము ఒక యజ్ఞవేదికగ మారును.

ముందు తెలుపబడిన సూర్య, భౌగోళిక ప్రజ్ఞలను ఆకాశ ప్రాణ తరంగములని (ఈథర్స్ ఆఫ్ ప్రాణ) మాస్టరు C.V.V. గారు నిర్వచించిరి. సృష్టియందలి మహాప్రాణమునకు వాహికలుగ ఈ ఆకాశ తరంగములు పనిచేయును. ఈ తరంగములద్వారా మహాప్రాణము ప్రవహించి జీవుల చైతన్యమును పూర్ణవంతము గావించును. ఈ విధముగ జీవుల రూపములను సహజముగ తీర్చిదిద్ది, మానవునకు దివ్యానుభూతికి దారులు తెరచును. మహాప్రాణమునకు నడుమ చైతన్య స్రవంతి స్థాపింపబడుటచే మానవుని నాడీమండలము, రక్తనాళములు, రక్త

కణములు స్వస్థత నందగలవు. ఒక ఇనుపముక్క అయస్కాంతముగ మారునపుడు ఇనుపముక్కలోని అణువులు ఏ విధముగ క్రతు బద్ధముగ అమర్చబడునో అదే విధముగ మానవ చైతన్యము అమర్చబడి దివ్యచైతన్యముతో అనుసంధానము చెందును. ఒక పెద్ద అయస్కాంతమునకు జతపరచిన ఇనుపముక్క అయస్కాంతముగ ఎట్లు మారుచున్నదో, అట్లే మాస్టరు చైతన్యముతో జతపడిన సాధకుని చైతన్యము మాస్టరు చైతన్యమునకు వాహికగ పనిచేయగలదు.

సంక్షిప్తముగ ముందు వివరింపబడిన విషయమును ఈ క్రింది విధముగ పాఠకులు అవగాహన చేసుకొనవలెను.

1. వ్యక్తిగత భావములు, స్వభావములు, అభ్యాసములు, నమ్మకములు ఒక జీవుని విశ్వ చైతన్యము నుండి వేర్పాటు గావించును.

2. బుద్ధి లోకములలోకి పెరుగుచున్న కొలది ఏకత్వము అవగాహన అగును.

3. మాస్టర్ C.V.V. గారు అందించిన శబ్ద ఉచ్చారణము శ్రద్ధా భక్తులతో నిర్వర్తించినచో మహా ప్రాణమునకు, వ్యక్తిగత ప్రాణమునకు ఆకాశ ప్రాణ తరంగములు వాహికలై నిలబడి వ్యక్తి ప్రాణమును ఉద్ధారణము గావించి మానవునకు పూర్ణ చైతన్యము ప్రసాదింపగలవు.

4. ఈ ప్రక్రియ భగవత్ సంకల్పముగ నూతనముగ కొనిరాబడినది. దానిని నిర్వర్తించిన మహాపురుషులు మాస్టర్ C.V.V.

5. ఇనుము అయస్కాంత సన్నిధిని చేరి అయస్కాంత మగునట్లు వ్యక్తి అంతర్యామి ప్రజ్ఞను తనయందు, తన పరిసరముల యందు అనుభూతి చెందగలడు.

6. ఈ ప్రక్రియ జరుగునపుడు సాధకుని నాడీ మండలము, రక్తనాళములు, రక్తము, అస్థిపంజరము కూడ స్వస్థతను పొందును.

# "EQUATOR EQUAL"
# ఈక్వేటర్ ఈక్వల్

**భూ**మిపై నిర్వర్తింపబడుచున్న అయస్కాంత తరంగములు భూమికి చంద్రునిద్వారా అందుచున్నవి. చంద్రునకు ఈ తరంగములు 'ఇంద్రగ్రహము' (నెప్ట్యూన్) ద్వారా అందుచున్నవి. ఇంద్రగ్రహము నుండి తాళ లయాత్మకమగు సంగీత తరంగములు వెలువడి ఆకాశ మండలమున అయస్కాంత శక్తిని ఏర్పరచుచున్నవి.

ఇంద్రగ్రహము నుంచి ప్రసారమగుచున్న తరంగములను చంద్రుడు ఒక నిర్దిష్టమైన విధానముగ భూమిపై ప్రతిబింబింప చేయుచున్నాడు. చంద్రుడు చేయు కార్యము అయస్కాంతీకరణము. సూర్యుని చుట్టు భూమి తిరుగుచుండుటచే దైనందినముగ సూర్య కిరణములు భూమిని విద్యుదీకరణము చేయుచున్నవి. భూమధ్యరేఖ నుండి ఉత్తరముగను, దక్షిణముగను సూర్యకిరణములు భూమిని చుట్టుచుండును. ఇది కారణముగ భూమి విద్యుదీకరణము చెంది యున్నది.

పై విధముగ సూర్య చంద్రాత్మక ప్రజ్ఞలు భూమిని విద్యుదీ కరణము, అయస్కాంతీకరణము చేయుచున్నవి. భూమిపై ఏర్పడు ఈ కోశము భూమి ప్రాణమయ కోశముగ పనిచేయును. భూమి ప్రాణమయ కోశము నుండియే భూమి జీవుల ప్రాణమయ కోశములు నిర్మాణ మగుచున్నవి.

ఈ విధముగ భూమి ప్రాణమయ కోశమును, సూర్యచంద్రులు నిర్మాణము చేయుచున్నారు. అంతరిక్ష మందలి ప్రాణముకన్న భూమి ప్రాణము భిన్నముగ నుండును. ఎందువలన అనగా భూమి పదార్థముతో సూర్యచంద్ర కిరణములు సంయోగము చెందును గనుక. ఏ గోళము యొక్క పదార్థ స్వభావమును బట్టి ఆ గోళము యొక్క ప్రాణ మేర్పడును. కనుకనే ఒక గోళముయొక్క జీవులు మరియొక గోళమున జీవించలేరు. సూర్యచంద్రుల తరంగముల ప్రభావము విద్యుదీకరణము, అయస్కాంతీకరణము. అవి భూమిని చేరునపుడు జరుగు రసాయనము భూమి యందలి ప్రాణము. ఈ ప్రాణమే భూమి జీవుల యందుండును.

భూమి శరీరముగను, భూమి ప్రాణము జీవుల ప్రాణముగను, చంద్రప్రజ్ఞ జీవుల మనస్సుగను, సూర్యకాంతి జీవుల బుద్ధిగను, సూర్యప్రజ్ఞ జీవుల ప్రజ్ఞగను భూమి జీవుల నిర్మాణము జరుగుచున్నది. ఇట్లు పంచీకరణముగ జీవుల నిర్మాణ మేర్పడుచున్నదని స్థూలముగ తెలియవలెను. సూర్యునకు - చంద్రునకు - భూమికి మధ్య గ్రహ సంచారము వలన ఏర్పడు కోణములు కారణముగ భూమికిని, జీవులకును పదహారు రకముల కళాకళలు ఏర్పడుచుండును. వాటికి హాని వృద్ధులు కలవు.

# "PITUITARY HINT"
# పిట్యూటరీ హింట్

వెన్నెముక యందలి బ్రహరంధ్రము యందునూ ప్రజ్ఞా కేంద్రములు గలవు. వీటిని 'చక్రము' లందురు.

వీని ఆధారముగనే శరీరమున నాడీ గ్రంథులు పనిచేయు చున్నవి. ఈ చక్రములు హృదయమునకు దిగువ మూడును, ఎగువ మూడునూ గలవు. దిగువ మూడు చక్రములు దేహముల అణు తయారీకినీ, దేహావశ్యకములను, మానవులకు వర్తింపజేయును. ఎగువనున్న మూడు ప్రజ్ఞాకేంద్రములూ తెలివి, దివ్యజ్ఞానము, దివ్యస్ఫూర్తి కలిగించును. ఈ పై దిగువుల ప్రజ్ఞాకేంద్రములను హృదయమున నున్న ప్రేమ సమన్వయము చేయుచుండును.

హృదయము నుండి భావన చేయువాడు హృద్యముగ మాట్లాడువాడు, పరహితముగ కార్యములు చేయువాడు అగును. హృదయమునందలి ప్రజ్ఞాకేంద్రమును విస్తృతి గావించి, దిగువ ప్రజ్ఞాకేంద్రములను, ఎగువ ప్రజ్ఞా కేంద్రములతో సంధానము గావింతురు. అట్టి వారికి హృదయము కేంద్రముగ, దిగువ కేంద్రము లకు ఎగువ కేంద్రముల ప్రజ్ఞను వ్యక్తము చేయు కేంద్రములుగ వృద్ధి చెందును. అట్టి సమయమున మూలాధార కేంద్రము సహస్రారము యొక్క ప్రజ్ఞావతరణమునకు వినియోగపడ గలదు.

అట్లే విశుద్ధి ప్రజ్ఞ స్వాధిష్ఠానము నుండి వ్యక్తము కాగలదు. అదే విధముగ మణిపూరక ప్రజ్ఞ ఆజ్ఞాకేంద్ర ప్రజ్ఞను వ్యక్తము చేయగలదు.

పై తెలుపబడిన విధముగ మణిపూరక కేంద్రము, ఆజ్ఞా కేంద్రమునకు ప్రతిస్పందించగా, భ్రూమధ్యమున ఒక నూతన స్పందన మేల్కొనును. దీనినే 'పిట్యూటరీ దేహ' మందురు. ఇది దేహమున వికసించినంతనే మానవునికి దివ్యస్పర్శ, దివ్యస్ఫూర్తి యేర్పడును. ఈ దివ్యస్పర్శకు వరుణ గ్రహము కారణము. దానిని ప్రచోదనము చేయుట మాస్టరుగారి సంకల్పము.

ప్రేమైక జీవనము కారణముగ, భ్రూమధ్యమున ఏర్పడు ప్రచోదనమును మాస్టరుగారు 'పిట్యూటరీ హింట్' అను మంత్రముచే మేల్కొల్పుటకు సంకల్పించినారు. మాస్టరుగారు కుంభచైతన్యమును భూమికి అవతరింపజేయుటకై దిగివచ్చిన అగస్త్యాంశ. కుంభ చైతన్యమునకు గ్రహాధిపతి వరుణుడు. వరుణుని ప్రభావము వలన మానవజాతి అతి త్వరితముగ పరిణామము చెందుట దివ్యప్రణాళికలో ప్రధాన భాగము. మాస్టరుగారు వరుణుని ప్రభావమును తన హృదయమున కాహ్వానించి, మేల్కొల్పి, విశ్వ చైతన్యముతో దానిని అనుసంధానము చేసినారు. దీనివలన విశ్వ చైతన్యమును మానవుల యందు ఆవిష్కరించుటకు ఒక నూతన యోగము నేర్పరచినారు. ఆ యోగము మనయందు ఉద్యమించుటకు "C.V.V." అను మంత్రము నందించినారు. దానిని ఉచ్చరించుట వలన హృదయమున ప్రకంపనములు కలిగి, క్రిందుమీదు కేంద్రములు అనుసంధానము

చెంది, ప్రేమైక జీవనము, పరహిత జీవనము సాధకునియందు అప్రయత్నముగ ఆరంభింపబడును.

ఇదే ప్రక్రియను 'పిట్యూటరీ రెగ్యులేషన్స్' (Pituitary Regulations) అను కోర్సుగా కూడా అందించినారు. ఆ కోర్సులోని మంత్రముల లోనిదే యీ వివరింపబడుచున్న మర్మ మంత్రము. మర్మమంత్రముల లోని కీలక మంత్రమే 'పిట్యూటరీ హింట్' అను మంత్రము. పిట్యూటరీ బాడీ ముందు వివరణ తెలిపినట్లు వికసించు నపుడు ఆకాశ తరంగములను మానవు డందుకొనగలిగి, దివ్యస్ఫూర్తిని చెందును. ఈ దివ్యస్ఫూర్తినే 'ఇంట్యూషన్' అందురు. ఈ స్ఫూర్తి కారణముగ భ్రూమధ్యము స్రవించి, వెలుగుతో కూడిన కణముల నేర్పరచును. దీనినే '*అంతఃకరణ శరీర*'మని జ్వాల్‌కూల్ మహర్షి నిర్వచించినారు.

ఈ రీతిగ భ్రూమధ్యమున ఏర్పడు వెలుగు అంతఃకరణ శరీరము కాగా ఆ వెలుగునే వేదఋషులు '*గాయిత్రి*'గా ప్రశంసించిరి. ఈ వెలుగు తన భ్రూమధ్యమున ఏర్పడినటువంటి వాడు గాయత్రీ మంత్రసిద్ధి నొందినటువంటి వాడు. పిట్యూటరీ దేహమునకు (*వరుణ గ్రంథి*) ఊర్ధ్వముఖముగా '*ఇంద్రగ్రంథి*' యున్నది. ఇది ఇంద్రగ్రహము (నెప్ట్యూన్) ప్రభావము కలిగియున్నది. ఈ గ్రంథిచ్ఛేదనము కలిగినవారికి తన్మయ స్థితి ఏర్పడును. దానినే 'దివ్యానుభూతి' యందురు. అందు జీవుని ప్రజ్ఞ స్థిరపడినచో దివ్యజీవనము ఏర్పడును.

అట్టివాడు మానవులలో మహాత్ముడు. పిట్యూటరీ హింట్ అను మంత్రము, వరుణగ్రంథి నుండి (పిట్యూటరీ బాడీ) ఇంద్రగ్రంథి (పీనియల్ గ్లాండ్) వరకునూ ఒక వెలుగు వంతెన నిర్మాణము చేయగలదు. ఈ రెండు గ్రంథులమధ్య అట్టి నిర్మాణము జరుగుట వలన ఇంద్రావరుణుల సమన్వయము జరిగి మానవునకు దివ్యత్వ మేర్పడి మనసు పూర్ణముగ 'బుద్ధిగ' మారును. అట్టి బుద్ధి దేహము నందలి పదార్థము నంతనూ ప్రకాశింపచేయును. ఇట్టి స్థితిపొందిన సాధకుడు యితరులకీ యోగమును అందించగల సమర్థుడు. అతడు తన చూపులతోనూ, వాక్కులతోను యితరుల నుద్ధరింపగలడు. అతని స్థితి సహజ సమాధిస్థితి. ఇంద్రావరుణుల ప్రభావము సమన్వయము చెందుటచే అంతర్బహిర్లోకములు అను విభేదము వాని కదృశ్యమగును. సత్యము దర్శనమగును.

# "HIDDEN CIRCUMFERENCE"
# హిడెన్ సర్కంఫరెన్స్

**చూ**చువానికి ఆకాశము నీలముగా గోచరించును. కానీ సత్యమునకు ఆకాశమునకు ఏ రంగూ లేదు. చోటు యందు రంగే మున్నది? అటులనే చూచు వారలకు భూమ్యాకాశములు సుదూర మున కలిసినట్లుండును. నిజమునకు భూమియందు అట్టి తావు లేదు. చర్మ చక్షువులకు గోచరించునవి భ్రాంతి దర్శనములే! కాని సత్యములు కావు. చూచువాడు కేంద్రముగ అతని చుట్టూ చూడగల ప్రదేశము అంతయూ ఒక పరిధిగ నేర్పడును. వివిధమైన మనుష్యు లకు వారున్న స్థానములను బట్టి పరిధులు వివిధములుగ నుండును. కేంద్రమునుబట్టి గదా పరిధి!

చూచువాని మనస్సు బుద్ధియందు లయమైనచో చూచువాడు తన్మయత్వమును చెంది కేంద్రమును కోల్పోవును. కేంద్రప్రజ్ఞ 'నేను' - 'తాను' అను ప్రజ్ఞ. అది ప్రత్యేక ప్రజ్ఞ. అది బుద్ధియందు లయమగు నపుడు 'బుద్ధి'గ నుండుటయే యుండును గాని, తన బుద్ధియని ప్రత్యేకముగ నుండదు. మహా బుద్ధియందు తాను నిలచియుండును. 'తాను' ప్రత్యేకముగా నున్నపుడు మహాబుద్ధిలోని అణులేశము తన బుద్ధిగ తనయందుండును. ఇట్లు తన బుద్ధి నశించి తాను కరగి, మహా బుద్ధియందు వుండుటచే 'తాను' యను కేంద్ర మదృశ్య మగును. అదృశ్యమైన కేంద్రము పరిధిని చేరి మొత్తముగ మారును. కేంద్రము అదృశ్యమైనచో పరిధికూడ అదృశ్యమగును. అప్పుడున్న స్థితి రూపాతీతమైన దివ్యస్థితి లేక అవధులు లేని వెలుగు స్థితి.

దానినే అనుభూతి యందురు. నిజమునకు రూపాతీత, అపరిమిత వెలుగు దర్శనమే అనుభూతియని పెద్దలు తెలిపినారు.

ఈ రీతిని 'అనుభూతి' చెందినవానికి పరిధి అదృశ్యమగును. అనగా మితి నుండి అపరిమితమునకు చేరును. ఈ స్థితినే దాగివున్న పరిధి లేక అదృశ్యమైన పరిధి స్థితిగా తెలుపుచూ మాస్టరుగారు ఈ స్థితిని చేరుకొనుటకు 'హిడెన్ సర్కంఫరెన్స్' అను మంత్రమును అందించినారు. పరిధి పరిమితుల నేర్పరచును. పరిమితి జీవుల పూర్ణానందమునకు అవరోధముగ నుండును. జీవుల చైతన్యస్థితిని బట్టి ప్రకృతి యిట్టి పరిమితుల నేర్పరచుచున్నది. చైతన్యము పెరుగు కొలది పరిమితి పలుచబడు చుండును. పూర్ణ చైతన్యవంతునికి పరిమితి మరుగుపడును. మరుగుపడునే కానీ, అంతరింపదని కూడా తెలియవలెను. అదియే ప్రకృతి రక్షణ.

పరిపూర్ణ జీవునిగా తననుండి తన పరిధి మరుగు పడినవాడు విశ్వానుభూతి కర్యుడు. తన పరిధి కారణముగా జీవునకు ఒక శాశ్వత అస్థిత్వ ముండును. ఇది కారణముగనే జీవుడు కూడ దేవునివలె సనాతనుడు, శాశ్వతుడు, నశింపనివాడై యుండును. దేవుని 'నారాయణు'డని పిలచినపుడు జీవుని 'నరు'డని పిలుతురు. రెండు పదములయందునూ 'నర' శబ్దమున్నది. 'ర' యనగా నశించుట. 'నర' యనగా నశింపకుండుట. తాను నశింపనివాడననియు, సనాతనుడ ననియు, శాశ్వతుడ ననియు తెలియుట ఈ మంత్రము పరమోద్దేశము. అట్లు తెలిసిన దేవుడు ప్రళయమునందు కూడా తన ఎఱుకను కలిగి, మరల సృష్టి ప్రారంభమున ఎఱుకతో వ్యక్తమగును. సనక సనందనాదులు, నారదుడు అట్టివారు.

# "SIDE WAYS"

# సైడ్ వేస్

ప్రక్క మార్గమని ఈ మంత్రమునకు స్థూలమైన అర్థము. ప్రజ్ఞ మనస్సు యందున్నప్పుడు ప్రక్క మార్గము పట్టుచుండును. వక్ర మార్గములు కూడ పట్టుచుండును. మనస్సుయందు స్థితిగొన్న ప్రజ్ఞ చపల, చంచల, అనపగామిని. చిందులువేయు చిత్తము నిలకడగా ఒక విషయమున యుండక, క్షణమునకొక విషయము పైకి చిందు చుండును. దీనినే మర్కట స్థితి యందురు.

'సైడ్ వేస్' అను మంత్రము ఈ స్థూల భావమునకు సంబంధించినది కాదు. అంతకు ముందు మంత్రము వలెనే మహాబుద్ధిని చేరిన ప్రజ్ఞ అనుభూతిగ మారి, పరిధిని మరుగు పరచుటచే తన దేహ పరిమితియును దాటి యితరులను స్పృశించు చుండును. దీనినే 'సాన్నిధ్య' మందురు. ప్రజ్ఞ వ్యాపనము చెంది, వ్యక్తిగత ప్రజ్ఞ పరిధి మరుగగుటచే వ్యాపనము చెంది తనచుట్టూ నున్న ప్రత్యగాత్మలకునూ సాన్నిధ్యము నందించును. ప్రత్యగాత్మలు దీనినే గురు సాన్నిధ్యమని, దైవ సాన్నిధ్యమని ఉత్సహించుచూ రుచి చూతురు. వ్యాప్తము చెందుచున్న జీవప్రజ్ఞ క్రమశః యితరులయందు కూడా తనను దర్శించుచుండును. అనగా, అన్యముగ గోచరించు చున్న వన్నియూ అనన్యముగ మారును. మొత్తమంతయూ 'నేను' అను ఒకే ప్రజ్ఞగ నిలబడును.

దీనిని 'సమాంతర వ్యాపనము' (Horizontal Expansion) అని మాస్టరుగారు నిర్వచించినారు. దీనినే క్రతువిద్యా దురంధరులు 'స్పిరిట్ లెవెల్' అందురు. కట్టడములను నిర్మాణము చేయు మేస్త్రీలు కూడా స్పిరిట్ లెవెల్ అను పనిముట్టును వాడుదురు. సమతలముగ నున్నదీ లేనిదీ తెలియుటకై ఈ పనిముట్టును (Spirit Level) వాడి, అవసరమైనచో సమతలమును మేస్త్రీ ఏర్పాటు చేయుచుండును. అటులనే ఆధ్యాత్మికముగా మేస్త్రీ లున్నారు. వీరిని 'మాస్టర్ మేసన్స్' అందురు. వీరు కూడా సమతలము కలిగి యితరులకు సమతల మేర్పరచ సమర్థులు.

మాస్టర్ C.V.V. గారు క్రతు విద్యలయందు కూడా యిట్లు నూతన ప్రచోదనము గావించినారు. ఇట్టి సమతల పరివ్యాప్తిని 'సమాధి' యని యోగవిద్య బోధించుచున్నది. 'అనన్యస్థితి' యని శ్రీకృష్ణుడు పలికినాడు. 'ఏకాంతస్థితి' యని వేదవ్యాసుడు తెలిపినాడు. "అనన్య మార్గమున నా విశ్వరూపమును భక్తు డనుభూతి చెందుచున్నాడు." అని భగవద్గీత ఘోషించుచున్నది.

# "MILLER FORM CENTRE"
# మిల్లర్ ఫార్మ్ సెంటర్

ముందు మంత్ర మాధారముగ 'ప్రజ్ఞ' సమాంతర వ్యాప్తి చెందినపుడు, సాధకుని ప్రజ్ఞానుభూతి యితరుల కందించుటకు వీలు పడును. తానెఱిగిన ధర్మమును, సత్యమును యితరుల కందునట్లుగా ప్రేమతో, ఓర్పుతో, అవగాహనతో పరిగ్రహించుట యుండును. అది కారణముగ తన స్పర్శకు ప్రతిస్పందించు వారందరునూ కూడా తాను కేంద్రముగా వృద్ధి చెందుదురు. తోటి వారితో సమానముగ తాను మెలగుట, వారిని క్రమశః తన అనుభూతి స్థితికి ఉద్ధరించుట దివ్య సంకల్ప మాధారముగ చేయుచుండును.

ఇట్లు సామూహిక ఉద్ధారణము చేయువాడు సద్గురువు. అట్టి సద్గురువును మాస్టరుగారు 'మిల్లర్' అనిరి. అనగా మిల్లును నడిపించువాడు అని అర్థము. అతడు సూత్రమై, కేంద్రమై తన తోటివారి ఉద్ధరణకు సూక్ష్మముగ కృషిచేయుట ఈ మంత్రము భావము. మూలాధారము నుండి సహస్రారము వరకు ఉద్ధారణ కార్యక్రమమును జరిపించు చుండును. ముందు పోవువారిని నెమ్మది పరచి, నెమ్మదిగ పోవువారిని తొందరపెట్టి అందరూ ఒక బృందముగ ఏకకాలమున గమ్యము చేరునట్లు చేయుట కుంభచైతన్యపు ప్రత్యేకత.

# "VERTICAL LEVELS"

# వర్టికల్ లెవెల్స్

మాస్టరుగారి వాహిక అయిన శిష్యుడు తాను సమానాంతరముగ వ్యాప్తిచెందుచూ, తోటివారిని యోగమున నడిపించుచుండ, వారు ఊర్ధ్వ ముఖముగ ప్రయాణము చేయుట సంభవించును. తన సాన్నిధ్య ప్రభావముచే వారు ఊర్ధ్వముఖు లగుచుండ, వారితో పాటు, తాను కూడా ఊర్ధ్వముగ ప్రయాణము చేయుట యుండును. ఈ ఊర్ధ్వముఖ ప్రయాణమును ''కుండలిని'' చైతన్యము మేల్కొంచుటగా తెలుపుదురు. దీనినే మాస్టరు గారు ''వర్టికల్ లెవెల్స్'' అనిరి.

ఇది కేవలము ఒక సిద్ధుడైన సాధకుని సాన్నిధ్యమున యితరులకు జరుగును. సాన్నిధ్యమాత్రమున అవలీలగ తోటివారి చైతన్యమును ఊర్ధ్వముఖముగ ప్రచోదనము చేయుట సద్గురువు సామర్థ్యము. తానే అందరియందు ''తాను''గ వ్యాప్తి చెందుటవలన వారికి కూడ ఉద్ధారణము జరుగును. ఇదియే గురువు శిష్యుని యందు పనిచేయుట. గురువిట్లు శిష్యునియందు జనింప, శిష్యుడభివృద్ధి చెందును. తన అభివృద్ధి యంతయు తానే సముపార్జించుకొను చున్నానని శిష్యుడు అనుకొను చున్ననూ గురుసాన్నిధ్యము అతనియం దుండుటయే అభివృద్ధికి అసలు కారణము.

# "MEET CENTRES"

# మీట్ సెంటర్స్

సోపానక్రమమున యిది చివరి మర్మమంత్రము. శిష్యుడు క్రమశః అభివృద్ధి చెందుచుండ, చివరి దశలో గురువువలనే 'పిట్యూటరీ హింట్' అను మంత్ర స్థాయికి చేరి, అటుపైన పరిమితమైన పరిధిని మరుగుపరచి పూర్ణమైన అనుభవ స్థితిని చేరును. అనగా 'హిడెన్ సర్కంఫరెన్స్, సైడ్ వేస్' అను సోపానముల నధిగమించి, గురువువలె పూర్ణబిందు స్థానము చేరును. బిందువు బిందువును చేరుటను 'మీట్ సెంటర్స్' అని మాస్టరుగారు సంబోధించిరి. అట్లు చేరినచో నేమగును? ఒక బిందువే మిగులును. అట్లు ఎన్ని బిందువులు చేరిననూ, అన్నియూ నొకటే యగును. అందువలననే ఈ బిందువు పూర్ణబిందువు. గణిత శాస్త్రమున ఒక సున్నను మరియొక సున్న చేరినదనుకొనుడు! మిగులునది ఒక సున్నయే కదా! ఇదియే వేద గణితము.

*"పూర్ణ మదః పూర్ణమిదం - పూర్ణా త్పూర్ణముదచ్యతే ।*

*పూర్ణస్య పూర్ణమాదాయ - పూర్ణయే వావ శిష్యతే॥"*

పూర్ణమును చేరిన బిందువు పూర్ణమైనదని తెలిసినది. పూర్ణమైన బిందువు మరల ఈవలకు వచ్చినచో ఏమగును? పూర్ణముగనే యుండును. అనగా శిష్యుడు గురుసాన్నిధ్యమున ఎదిగి, సమాధిస్థితి పొందినపుడు శిష్యుడు గురు వగును. అపుడు శిష్య డుండడు.

క్రొత్తగా గురువైన గురువు, మరల బృందముల నాకర్షించును. ఇట్లు సాన్నిధ్యమున సమస్తమునూ ఏకత్వము చెంది రెండవది లేక యుండును. ఇదియే అనన్యస్థితి లేక సమాధి.

జాతిని ఈ అనన్యస్థితికి చేర్చుటకు శ్రీకృష్ణుడు ఒక ప్రయత్నము చేసెను. యోగబలమున తన సాన్నిధ్యము బృందావన వాసుల కిచ్చి వారిని ఆత్మస్థితికి ఉద్ధరించెను. సాన్నిధ్య మార్గమునట్లు మైత్రే యాదుల కందించెను. మరల కుంభయుగమున మాస్టరుగారు కూడా సాన్నిధ్య మార్గమునే ప్రతిపాదించిరి. బిందువు లన్నియును కేంద్రమును చేరుటచే సమస్తము లందునూ కేంద్రమే వర్తించును. ఇదియే పూర్ణతత్త్వము. దీనినే పూర్ణయుగముగ మాస్టరుగారు మరల అందించినారు.

॥ ఓం తత్ సత్ ॥

# మాస్టరు మాట

" ఈ జ్ఞానంవల్ల ఏమి సాధిస్తావు? ఈ శరీరంతోటే జ్ఞానమూ పోతున్నది కదా! అందువల్ల జ్ఞానంవల్ల ఏమిటి ప్రయోజనం? సృష్టితో సాగిపోతూనే ఒక స్థిరత్వమూ – పూర్ణత్వమూ ఏర్పరచుకొని పూర్ణప్రజ్ఞతో మృత్యుంజయులుగా అమృతత్త్వమును పొందుటయే మనకు ధ్యేయం కావాలి! దాని కొరకే ఈ యోగం! ఈ ఆశయాలు అంగీకారమైతే మీరిందులో చేరి సాధన చేయవచ్చు. "

" నీవు స్వబుద్ధితో ఆలోచించు. యుక్తముగా నున్నదా అని విచారించు. ఇది (యోగము) నీకు నచ్చిన – నీ మనసు మెచ్చిన – నీకు అచ్చివచ్చినచో అనుసరించు. గ్రుడ్డిగా మాత్రము నమ్మకు. నీవు ఆలోచించి చూచి అడుగిడుము. పైకి రమ్ము."

" ఇట్లా అతి సామాన్య మానవ రూపములో నున్న నేను ఎవరు? ఆది బ్రహ్మమును (Origin No.1). నేను ఇతర లోకపాలకుల కెరుకపడకయే, రహస్య మార్గమున భూమిపై అవతరించితిని. ఇచటి విశేషములను స్వయముగా తెలుసుకొనగోరి, ఇచటి మానవానుభూతులు ఎట్లా నడుస్తున్నాయో స్వయంగా తెలుసుకొనవలెనని వచ్చితిని. మానవతలోని లోపాలు ఎలాంటివి? వాటికి నివారణోపాయా లెట్టివి? సృష్టి ధర్మమెట్లా నడుస్తున్నది? ఎట్లా నడిస్తే బాగుంటుంది? ఈ భూమి మీద ఎలాంటి మార్పులు చేయటం అవసరం? అనే సంగతులు స్వయంగా ఎరుగుటకుగాను ఆది బ్రహ్మమునగు నేను, ఈ C.V.V. రూపము నందితిని; ఇదెట్లా అంటే? ఒక చక్రవర్తి తన విశాల సామ్రాజ్యంలోని బహు ప్రాంతాల్లో ఏం జరుగుతున్నదీ తెలుసుకొనటానికై రహస్యంగా ఆయా ప్రాంతాల్లో ప్రయాణం చేయుట వంటిది. చక్రవర్తి స్వయంగా తన ప్రజల కష్టసుఖాలు, విశేషాలు ఎరుగుటకై తన క్రింద పరిపాలకులుగా నున్న గవర్నర్లకు, మండలాధిపతులకును తెలుపకయే రహస్యముగా వచ్చి పలు ప్రాంతములు పర్యటించి ప్రజలతో కలసిమెలసి తిరిగి, అన్ని సంగతులూ తెలుసుకొనటం లాంటిది నా యీ ఉనికి, నేనిప్పుడా పని చేస్తున్నాను."

“ నేను సంపూర్ణుడను. Perfection పొందిన వాడను. పురుషోత్తముడను. నా ప్రయత్నమంతా ఇతరుల నుద్ధరించవలెనని. ఇతరులలోని లోపములను పోగొట్టి వారందరునూ దివ్య పురుషులనుగా, ఉత్తమ పురుషులనుగా చేయుటకే నే నిచట నున్నాను. నా కొరకు కాదు. నాకు నమస్కరించిన వారందరినీ నా అంత వారినిగా చేయుట ఈ యోగ లక్ష్యము. పరమావధి. మీరంతా దివ్య పురుషులు, బ్రహ్మ స్వరూపులు కావలయును. నేనట్లు చేయుదును. అట్లు చేయుటయే నాకు డెవలప్‌మెంట్. ”

“ ఈ వేళ ఉండి రేపు పోయే వస్తువు లిస్తాను. మీరు తీసుకొంటారు. పోగొట్టుకుంటారు. ఏమిటి లాభం? అలా కాదు. నా గుర్తు, నేనే సదా మీలో వర్తించుటయే. అలా సదా మీలో వర్తించు నేను, ఎల్లప్పుడూ మీలోనే ఉంటాను. నా గుర్తు కావాలంటున్నారు. నా గుర్తు మీరే సుమా! మీరంతా నా ‘యోగాలైను’ అనుసరించి, అందరకూ తెలియ జేస్తుంటారు. ఈ యోగాన్ని ప్రకటించే వారంతా నా గుర్తులే అని తెలుసుకొనండి! అంతే కాని నేనిచ్చే కలమో, కోటో గుర్తు కాదు! ”

" మీరు కష్టముల కోర్చి ఈ యోగసాధన చేయవలయును. సుఖములే లభించునని తలంప వలదు. కష్టపడి పట్టుదలతో బాధలు సహించి, మీరీ యోగానుష్ఠానమును చేయవలయును. ఈ సత్యము (Truth) నెరుగుటకై చేయు యత్నము సులభము కాదు. కొలంబస్ క్రొత్తగా అమెరికా ఖండమును కనుగొనుటలో కనబరచిన పట్టుదల, ధైర్యము, కష్టముల కోర్చునట్టి నేర్పు మీకు తప్పక ఉండ వలయును. క్రొత్త శాస్త్ర విషయములను, క్రొత్త భూ ఖండములను కనుగొను శాస్త్రజ్ఞున కుండవలసిన ధైర్యసాహసములు, ఓర్పు, వీడని పట్టుదల మీ కుండవలయును. సాధన ద్వారా లక్ష్యము సాధింప వలయును. అమృతత్త్వము అను దివ్యమగు వరమును, మీరు తప్పక పడయవలయును. ఇందులకు అచంచల విశ్వాసము (Unshakable Faith) దృఢ ప్రయత్నము కావలెను. "

" నాకింకేమీ అక్కరలేని స్థితి కావలయును. నే నితరుల కిచ్చువాడను కావలయునే కాని, నే నితరుల నుండి కోరువాడను కారాదు. నన్ను నిన్ను చేయుడు. అప్పుడు నా కే కొఱతయు నుండదు. "

“గురువేదో చెప్పి వెళ్లుట కాదు. గురువు శిష్యునిలో ప్రవేశించి, శిష్యుని తనంతవానిగా చేయుట, గురువు శిష్యుడగుట జరుగవలయును. ‘నేను సదా నీలో వర్తించు చున్నాను’ అని యిదివరకు గురువు లెవరూ చెప్పలేదు.”

" అంతటను నిండియుండు బ్రహ్మమును ఈ శరీరముతో మనకుగా మనము ఎరుగునట్లు చేయుటయే ఈ యోగాశయము. అవ్యక్తముగా నున్న బ్రహ్మము వ్యక్తమై మనలో ప్రవర్తిల్ల వలయును. జీవుడు, బ్రహ్మము ఏకమై జీవ బ్రహ్మైక్యము అగును. అప్పుడు మనము వారుగా అగుదుము. "

" నీవు సంసారిగా నుండుము. సన్న్యాస మక్కర లేదు. అడవులను, కొండలను బట్టి ఒంటిరివై తిరుగ పని లేదు. అందరిలో ప్రేమమయుడవై అందరికీ ఆనందము నందిమ్ము. అందరి బాధలను తొలగించుము. అందరితో కలసి కలుపుగోలుగా నుండుము. జీవిత సుఖములు, ఆనందములు ఛీ! ఛీ! పనికిరానివని త్రోసివేయకుము. నీలోని అసత్యత వగైరా చెడుగులను త్రోసివేయుము. మంచిని పెంచుము. నీ వేషభాషలు, ఆచార వ్యవహారములు వింతగా, విడ్డూరముగా ఉండరాదు. అందరకు స్నేహపాత్రముగా ప్రీతిపాత్రముగానే వుండ వలయును. "